సిద్దిపేట జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ)గా లక్ష్మీకిరణ్

సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి: సిద్దిపేట జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ)గా లక్ష్మీకిరణ్ బుధవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో బాధ్యతలు స్వీకరిం చారు. అనంతరం జిల్లా కలెక్టర్ కె.హైమావతిని మర్యాద పూర్వకంగా కలిసి జిల్లాలో రెవెన్యూ వ్యవస్థ, భూ భారతి పెండింగ్ దరఖాస్తుల డిస్పోజల్‌పై చర్చించారు. అనంతరం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు.

మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట

వార్త

వైభవంగా శ్రీరామ పట్టాభిషేకం

గజ్వేల్, ఏప్రిల్ 15 (ప్రభాతవార్త): పట్టణంలోని శ్రీసీతారామ ఉమామహేశ్వరాలయంలో బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయంలో శ్రీ సీతారామ ఉమామహేశ్వరుల కళ్యాణం, రథోత్సవం నిర్వహించగా ఈ సంవత్సరం ప్రప్రథమంగా ఈ ఉత్సవాలకు కొనసాగింపుగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గజ్వేల్ డివిజన్ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య నిర్వహణలో శ్రీరామ పట్టాభిషేకం కార్యక్రమాన్ని బుధవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య అధ్యక్షుడు దేశపతి శంకరశర్మ, కార్యదర్శి రేబల్లి రవీందర్‌రావు, కోశాధికారి విఠాల కృష్ణమూర్తిశర్మ, పురోహితులు నరసింహరామశర్మ, దేశపతి రాజశేఖరశర్మ, చాడ నందబాలశర్మ, పూజారి వాసవాచారి, నాగేందర్‌రావు, జితేందర్‌రావు, రాజేందర్‌రావు, విశ్వేశ్వర్ రావు, రాజేశ్వర్, శరత్, వరదాచారి, మురళీమోహన్‌శర్మ, జెవిఎల్ఎన్.రావు, జాలిగామ సుధాకర్‌రావు, వెంకటేశ్వరశర్మతో పాటు గాయత్రి మహిళా సంఘ సభ్యులు, గజ్వేల్ బ్రాహ్మణ యువ పరిషత్ అధ్యక్షుడు విఠాల సాయి, కార్యదర్శి శ్యాంప్రసాద్‌శర్మ, కోశాధికారి రాఘవేందర్‌రావు, వరుణాచార్యులు, శ్రీనాథ్, ఆలయ కమిటీ సభ్యులు శ్రీధర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలి

సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

సంగారెడ్డి మున్సిపాలిటీ, ఏప్రిల్ 15, ప్రభాతవార్త

జిల్లాలో ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తిచేయాలని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ ఛాంబర్‌లో మహిళా శిశు సంక్షేమ శాఖ, విద్యాశాఖ, డిఆర్డిఏ, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ అధికారులతో కలిసి పనుల పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో చేపట్టిన స్కూల్ కాంపౌండ్ వాల్స్, పాఠశాలల మరుగుదొడ్లు, జీపీ బిల్డింగ్స్, మహిళా సంఘ భవనాల నిర్మాణ పనులు నిర్దిష్ట కాలపట్టికలో పూర్తిచేయాలని స్పష్టం చేశారు. ప్రతి పనిని నాణ్యతతో చేపట్టి ప్రజలకు ఉపయోగకరంగా ఉండేలా చూడాలని సూచించారు. జిల్లాలో కొనసాగుతున్న పనుల ప్రగతి సంతృప్తికరంగా లేనిచోట వెంటనే చర్యలు తీసుకోవాలని, పనుల్లో ఆలస్యం జరగకుండా సంబంధిత అధికారులు పర్యవేక్షించాలని చెప్పారు. ముఖ్యంగా పాఠశాలల్లో కాంపౌండ్ వాల్‌లు, టాయిలెట్స్ నిర్మాణాన్ని త్వరగాపూర్తిచేసి విద్యార్థులకు భద్రతా వాతావరణం కల్పించాలని ఆదేశించారు. మహిళా సంఘ భవనాల నిర్మాణం ద్వారా స్వయం సహాయక సంఘాల కార్యకలాపాలు మరింత బలోపేతం అవుతాయని, ఈ పనులను ప్రాధాన్యతతో పూర్తిచేయాలని సూచించారు. గ్రామస్థాయిలో పర్యవేక్షణ పెంచి, పనుల నాణ్యతను క్రమం తప్పకుండా తనిఖీచేయాలని అధికారులకు ఆదేశించారు. డిఆర్డిఏ, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖలు సమన్వయంతో పనిచేసి పనులను సమయానికి పూర్తి చేయాలని, ఎటువంటి నిర్లక్ష్యం లేకుండా పారదర్శకంగా అమలు చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా అధికారులు తమ తమ విభాగాల పనుల ప్రగతిపై వివరాలు సమర్పించారు. ఈ సమావేశంలో మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారిణి లలిత కుమారి, డీఈఓ వెంకటేశ్వర్లు, పీడీ డిఆర్డిఏ జ్యోతి, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సేకరించిన భూమిని ప్రభుత్వ పొజిషన్‌లోకి తీసుకురావాలి

జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

సంగారెడ్డి మున్సిపాలిటీ, ఏప్రిల్ 15, ప్రభాతవార్త : జహీరాబాద్ పారిశ్రామికవాడలోని జాతీయ పెట్టుబడి, తయారీ మండలి (నిమ్జ్) పరిధిలో మొదటిదశలో సేకరించిన 3245 ఎకరాల భూమిని 45 రోజులలో పూర్తిస్థాయిలో ప్రభుత్వ పొజిషన్‌లోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ భూమిని కేంద్ర ప్రభుత్వ సంస్థ నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు వెంటనే అప్పగించేలా తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రెవెన్యూ, నిమ్జ్, టీజీఐఐసీ అధికారులు, ఏఈఓలు, కాంట్రాక్టర్లతో సమీక్షసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... మొదటి దశలో 3245 ఎకరాల భూమిని పూర్తిగా ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకురావాలని, ఈ ప్రక్రియను వేగవంతంచేయాలని ఆదేశించారు. నిమ్జ్ ఫేజ్-1 పరిధిలో మిగిలి ఉన్న ఎల్గోయి, సిద్దాపూర్, చిలేపల్లి, ముంగి, రుక్మాపూర్, హద్నూర్ గ్రామాల్లోభూములు స్వాధీనపర్చుకోవడానికి సర్వే నిర్వహణ కోసం ప్రత్యేకంగా 6 బృందాలను ఏర్పాటు చేయాలని తెలిపారు. ప్రతి బృందంలో రెవెన్యూ, పోలీస్, వ్యవసాయ శాఖ ఎక్స్టెన్షన్ అధికారులు, గ్రామపంచాయతీ సిబ్బంది ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయా గ్రామాల్లో పూర్తి స్థాయి సర్వే నిర్వహించి, ప్రతి రోజు సమీక్ష ద్వారా పనుల పురోగతిని పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్ మాధురి, నిమ్స్ ప్రత్యేక అధికారి విశాలాక్షి, టిజిఐఐసి జోనల్ మేనేజర్ విట్టల, జహీరాబాద్ ఆర్డీఓ దేవుజా, జహీరాబాద్ డిఎస్‌పి సైదులునాయక్ నిమ్జ్ డిప్యూటీతహసీల్దార్ ఆనంద్ కుమార్, వ్యవసాయ శాఖ ఎక్స్టెన్షన్, పోలీస్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరించండి : ఎమ్మెల్యే

కలెక్టర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు

జహీరాబాద్, ఏప్రిల్ 15, ప్రభాతవార్త: జహీరాబాద్ నియోజకవర్గ ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు బుధవారం సంగారెడ్డిలోకి కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్‌తో సమావేశం అయి వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాణిక్‌రావు మాట్లాడుతూ మిషన్ భగీరథ నీరు రాక తాగునీటి సమస్య తాండవిస్తోందని, నియోజకవర్గానికి బోర్లను మంజూరు చేయాలని, రహదారుల మరమ్మతులు, పెండింగ్‌లో ఉన్న పనులు, రైతుల సమస్యలను పరిష్కారించాలని కలెక్టర్‌కు విన్నవించినట్లు తెలిపారు. మండల కేంద్రమైన ఝరాసంగంలో ప్రధాన రహదారి విస్తరణ పనులకు సంబంధించిన విద్యుత్ స్థంభాల షిఫ్టింగ్ గురించి నిధులు కేటాయించాలని కోరామన్నారు. పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని, శనగల కొనుగోలు చేయాలని వినతి చేశామన్నారు. మైనార్టీ లబ్దిదారులకు కుట్టు మిషన్‌లను అందచేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న మాజీ సర్పంచ్‌ల బిల్లులను ఇప్పించాలని వినతిచేశామన్నారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఎమ్మెల్యేతో పాటు జహీరాబాద్, ఝరాసంగం, మొగుడం పల్లి మండలాల బిఆర్ఎస్ అధ్యక్షులు తట్టు నారాయణ, వెంకటేశం, సంజీవ్‌రెడ్డి ఉన్నారు.

ట్రాఫిక్ నియమాలు పాటించాలి : డిఎస్‌పి

సంగారెడ్డి మున్సిపాలిటీ ఏప్రిల్ 15, ప్రభాతవార్త : ట్రాఫిక్ నియమాలను పాటించి రోడ్డు ప్రమాదాలను నివారించాలని సంగారెడ్డి డి.ఎస్.పి సత్తయ్యగౌడ్ పిలుపునిచ్చారు. బుధవారం సంగారెడ్డి, శాంతినగర్‌లోని సెయింట్ ఆంథోనీ మహిళా డిగ్రీ కళాశాలలో అరైవ్ అలీవ్ పేరిట ట్రాఫిక్ నియమాలు, రహదారి భద్రతపై నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులకు రహదారి భద్రత ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణారెడ్డి, సంగారెడ్డి టౌన్ ఇన్‌స్పెక్టర్ పి. రామునాయుడు, సెయింట్ ఆంథోనీ విద్యాసంస్థల డైరెక్టర్ విజయ్‌రెడ్డి మాట్లాడారు. మహిళా డిగ్రీ కళాశాల, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, మాస్టర్స్ డిగ్రీ కళాశాల విద్యార్థులు, బీసీ, ఎస్సీ వెల్ఫేర్ హాస్టల్ విద్యార్థులు పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న డిఎస్‌పి, సిఐలు

మండల సభలను విజయవంతంగా నిర్వహించాలి

సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి

జూమ్ సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ హైమావతి

సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి: ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ఈ నెల 16న నిర్వహించే మండల సభలను విజయవంతంగా నిర్వహించాలని సిద్దిపేట జిల్లా కలెక్టర్ కె.హైమావతి ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఈ నెల 16న నిర్వహించే మండల సభ ఏర్పాట్లపై జిల్లా అధికారులు, మండల స్థాయిలో ఎంపిడివో, తహసీల్దార్, ఎంఈవో, మెడికల్ ఆఫీసర్, అగ్రికల్చర్, హౌసింగ్, పంచాయతీరాజ్ ఏఈలు, ఎపిఎం, ఐసిడిసి ఇతర శాఖల అధికారులకు కలెక్టర్ జూమ్ సమావేశం ద్వారా దిశా నిర్దేశం చేసి మాట్లాడారు. ఈనెల 16న నిర్వహించే మండల సభల నిర్వహణను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. మండల సభల ఏర్పాట్లు, నిర్వహణ బాధ్యత ఎంపిడిఓలదేనని తెలిపారు. మండలంలోని వివిధశాఖల అధికారులతో కో-ఆర్డినేట్ చేసుకొని ప్రభుత్వ పథకాల అమలు, మండల స్థాయిలో మంచి ఫోటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయాలన్నారు. అరైవ్-అలైవ్ రవాణా, పోలీసు అధికారులతో ప్రతిజ్ఞ, థీమ్ ఉద్దేశం సభలో చర్చించాలని ఆదేశించారు. మండల సభలకు ఎంపి, ఎమ్మెల్యే, ఎఎంసి చైర్మన్లు, మండల ప్రజాప్రతినిధులను అధికారులు ఆహ్వానించాలన్నారు. ప్రభుత్వ పథకాలు రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, గృహజ్యోతి, గృహలక్ష్మీ, సన్న బియ్యం, వడ్డీలేని రుణాలు, సన్నవడ్లకు బోనస్, రైతు రుణమాఫీ తదితర పథకాలపై ప్రజలకు వివరించాలన్నారు. ప్రభుత్వ పథకాల అమలుపై స్టాళ్లను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈనెల 16న ఉదయం 10గంటలకు సభ ప్రారంభించాలన్నారు. సభలో చేసిన ప్రోగ్రామ్ మొత్తం ప్రక్రియ డాక్యుమెంట్ చేయాలని ఆదేశించారు. జూన్ 2 నుంచి ప్రభుత్వం అమలు చేసే కొత్త పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. మండల సభలో దరఖాస్తులు ఇస్తే స్వీకరించి పరిష్కరించాలన్నారు. మండల సభలను అధికారులు సమన్వయంతో ఒక పండుగ వాతావరణంలో విజయవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు లక్ష్మీకిరణ్, అబ్దుల్ హమీద్, జడ్పీ సీఈఓ రమేష్, డిఆర్‌డిఎపిడి జయదేవ్ అర్య, డిపివో రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ కొరత లేదు.. ఇంటి వద్దకే సరఫరా

సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

సంగారెడ్డి మున్సిపాలిటీ, ఏప్రిల్ 15, ప్రభాతవార్త

జిల్లాలో వంట గ్యాస్ కొరతలేదని, ప్రతి ఇంటికీ గ్యాస్ సరఫరాకు ఎటువంటి అంతరాయంలేకుండా అందించాలని సంబంధిత అధికారులను సంగారెడ్డి జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో జిల్లాస్థాయి ఎల్పిజి సరఫరా మానిటరింగ్ కమిటీ సమీక్ష సమావేశాన్ని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) మాధురితో కలిసి నిర్వహించారు. ఈ సమావేశంలో పౌరసరఫరాల శాఖ, పోలీస్ శాఖల అధికారులు, గ్యాస్ ఏజెన్సీల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో కృత్రిమంగా గ్యాస్ కొరత సృష్టించే చర్యలను సహించబోమని స్పష్టం చేశారు. ప్రజలకు అవసరమైన వంట గ్యాస్‌ను ఇంటి వద్దకే సమయానికి అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. సంక్షేమహాస్టళ్లు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో గ్యాస్ సరఫరా పరిస్థితిపై వివరాలు తెలుసుకున్న కలెక్టర్, ప్రభుత్వ సంక్షేమ వసతిగృహాలకు గ్యాస్ కొరతరాకుండా ఎల్‌పిజి సరఫరా కొనసాగించాలని సూచించారు. గ్యాస్ పంపిణీలో అక్రమాలు జరగకుండా విజిలెన్స్ అధికారులు తరచూ తనిఖీలు నిర్వహించి, అక్రమ నిల్వలపై కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. డిమాండ్‌కు అనుగుణంగా సరిపడా స్టాక్‌ను నిర్వహించడంతోపాటు అదనంగా 15 శాతం నిల్వలను కచ్చితంగా ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డిఎం సివిల్ సప్లై అంబదాస్ రాజేశ్వర్, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి (ఇన్‌చార్జ్) రాజేశ్వర్, రవాణా శాఖ అధికారి అరుణ, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి అఖిలేష్‌రెడ్డి, బీసీ వెల్ఫేర్ అధికారి జగదీష్, డిఎల్ఏంఓ అనిల్ కుమార్, ఎల్పిజి గ్యాస్ ఏజెన్సీల ప్రతినిధులు పి.ప్రతాప్‌రెడ్డి, జె.మురళీధర్‌రెడ్డి, వై.వినోద్‌కుమార్, పోలీస్ శాఖ అధికారులు, సివిల్ సప్లై సిబ్బంది పాల్గొన్నారు.

హౌస్ లిస్టింగ్ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలి...

సంగారెడ్డి మున్సిపాలిటీ, ఏప్రిల్ 15, ప్రభాతవార్త

జనగణన కార్యక్రమంలో భాగంగా చేపట్టనున్న హౌస్ లిస్టింగ్ ఆపరేషన్ (ఇండ్ల గణన) ప్రక్రియను పారదర్శకంగా, నిర్దిష్ట విధానాలతో నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య సంబంధిత అధికారులకు ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో ఇండ్ల గణన కార్యక్రమం నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మే 11వ తేదీ నుండి ప్రారంభమయ్యే ఫస్ట్ ఫేజ్ హౌస్ లిస్టింగ్ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు ముందస్తుగా పూర్తి చేయాలని సూచించారు. ఇండ్ల గణనలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా ఖచ్చితమైనవిధానాలను పాటిస్తూ పారదర్శకంగా నిర్వహించాలని తెలిపారు. ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్లకు ఈ నెల 18వ తేదీ నుండి మే 5వ తేదీ వరకు శిక్షణ కార్యక్రమాలను పూర్తి చేయాలని తెలిపారు. క్షేత్ర స్థాయిలో అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టి పనితీరును సమీక్షించాలని సూచించారు. అదేవిధంగా, స్వయంగా వివరాలు నమోదు చేసుకునే వారికి (సెల్ఫ్ ఏనుమేరేషన్) ఏప్రిల్ 26 నుండి మే 10వ తేదీ వరకు అవకాశం కల్పించబడుతుందని, దీనిపై విస్తృ ప్రచారం నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ మాధురి, సీపీఓ కార్యాలయ ఏడి గీత, ఎం.కె. నాయక్, ఇంద్రసేనారెడ్డి, ఈడీఎం ఉదయ్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

139 కిలోల గర్భిణీ స్త్రీకి పండంటి పాప జననం

-క్లిష్టమైన శస్త్ర చికిత్సను విజయవంతంగా పూర్తిచేసిన వైద్యులు

గజ్వేల్ టౌన్, ఏప్రిల్ 15 (ప్రభాతవార్త): పట్టణంలోని ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలో వైద్యులు బుధవారం ఒక అరుదైన, అత్యంత క్లిష్టమైన శస్త్రచికిత్సను విజయవంతంగా పూర్తిచేసి తమ ప్రతిభను చాటుకున్నారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా యాప్రాల్ గ్రామానికి చెందిన సాయిరాం పూజ(29)కు వైద్యులు సురక్షితంగా ప్రసవం చేశారు. సాయిరాం పూజ 139 కిలోల ఊబకాయంతో పాటు థైరాయిడ్ సమస్యతో బాధపడుతుండగా ప్రైవేట్ ఆసుపత్రుల్లో సంప్రదించగా రూ.2 లక్షల వరకు ఖర్చు అవుతుందని చెప్పడంతో ఆర్థిక స్థోమత లేక ఒక మిత్రుని ద్వారా గజ్వేల్ ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అన్నపూర్ణను సంప్రదించారు. డాక్టర్ అన్నపూర్ణ ప్రత్యేకమైన చొరవ తీసుకొని వైద్యులు ఒక టీంగా ఏర్పడి పూజకు శస్త్ర చికిత్స చేయగా 3.75 కిలోల బరువుతో ఆడ శిశువుకు జన్మనిచ్చింది. ప్రస్తుతం తల్లి, బిడ్డ ఇద్దరు క్షేమంగా ఉన్నారని వైద్యులు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ అన్నపూర్ణ మాట్లాడుతూ ఊబకాయం అనేది మనం నిర్లక్ష్యం చేసే పెద్ద సమస్య అని, దీనివల్ల భవిష్యత్తులో బిపి, షుగర్, క్యాన్సర్ వంటి ముప్పులు పొంచి ఉంటాయని హెచ్చరించారు. థైరాయిడ్ ఉండడం వల్ల అధిక బరువు, నీరసం, అలసట, చలిని తట్టుకోలేకపోవడం, నిద్రలేమి, జుట్టు రాలడం, చర్మం పొడిబారడం, మలబద్ధకం, గుండె వేగంలో మార్పులు, మానసిక ఒత్తిడి లాంటి లక్షణాలు ఉన్న మహిళలు తక్షణమే వైద్యులను సంప్రదించాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ఉన్న అత్యాధునిక వైద్య సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ క్లిష్టమైన శస్త్రచికిత్సను విజయవంతంగా పూర్తిచేసిన వైద్యులను, సిబ్బందిని సూపరింటెండెంట్ అభినందించారు. గజ్వేల్ నియోజకవర్గ ప్రజలు ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లి ఆర్థికంగా ఇబ్బంది పడకుండా జిల్లా ఆసుపత్రిలో నాణ్యమైన చికిత్స పొందాలని పిలుపునిచ్చారు. పూజ భర్త, బంధువులు డాక్టర్ అన్నపూర్ణతో పాటు ఆసుపత్రి వైద్యులకు, సిబ్బందికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

మాట్లాడుతున్న ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అన్నపూర్ణ

ఆర్టిజన్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

ఆర్టిజన్ కార్మికులు చేపట్టిన సమ్మెకు సంఘీభావం తెలుపుతున్న కార్మిక సంఘాల ప్రతినిధులు

సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి: విద్యుత్ ఆర్టిజన్ కార్మికులను వెంటనే కన్వర్షన్ చేసి వారి న్యాయమైన డిమాండ్‌లను పరిష్కరించాలని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి గోపాలస్వామి, ఏఐటియుసి జిల్లా కార్యదర్శి కిష్టపురం లక్ష్మణ్, హెచ్ఎంఎస్ రాష్ట్ర కార్యదర్శి ఇదారి మల్లేశం, బిఆర్‌టియు రాష్ట్ర కార్యదర్శి మంచ నరసింహులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విద్యుత్ కార్మికులు చేపట్టిన సమ్మె బుధవారం 8వ రోజుకు చేరుకోవడంతో జిల్లా కార్మిక సంఘాల నాయకులు పాత బస్టాండ్ అంబేద్కర్ సర్కిల్‌లో నిరసన వ్యక్తం చేసి అనంతరం డిఈ ఆఫీస్‌లో సమ్మె చేస్తున్న విద్యుత్ కార్మికులకు సంఘీభావం తెలిపి మాట్లాడారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఆర్టిజన్ కార్మికులకు ఇచ్చిన హామీని నెరవేర్చాలన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండున్నర ఏళ్లు గడిచి పోతున్నా ప్రభుత్వం ఆర్టిజన్ కార్మికుల సమస్య లను పరిష్కరించకపోవడంతోనే సమ్మెకు దిగాల్సి వచ్చిందన్నారు. సమ్మె చేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించకుండా తొలగిస్తామని ప్రభుత్వం బెదిరింపులకు దిగడం సరికాదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఆర్టిజన్ కార్మికుల సమస్యను పరిష్కరించాలని, లేనియెడల వారికి మద్దతుగా కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు ఎల్లయ్య, భాస్కర్, చొప్పరి రవికుమార్, కనకయ్య, అరవింద్, శోభన్, శ్రీనివాస్, ఎస్ఎఫ్ఐ ప్రతినిధులు అభిషేక్, ప్రవీణ్, జెఏసి చైర్మన్ చిట్కూరి సుధాకర్, కన్వీనర్ నాగ బేరయ్య, నాగేందర్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, సుమన్, గౌటి భాస్కర్, మౌనిక, సరిత, రేణుక పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అంజిరెడ్డి

జడ్పిహెచ్ఎస్ స్థలానికి రక్షణ కల్పించాలి

తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ (టిఎస్ఈసి), పూర్వ విద్యార్థులు

పటాన్‌చెరు, ఏప్రిల్ 15, ప్రభాతవార్త : జెడ్పిహెచ్ఎస్ పటాన్‌చెరు పాఠశాల స్థలాన్ని రక్షించాలని, ఈ మధ్యకాలంలో పాఠశాల కాంపౌండ్ వాల్‌తో పాటు పాత భవనాన్ని కూల్చి వేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ, పటాన్‌చెరు పాఠశాల పూర్వ విద్యార్థుల ఐక్య వేదిక ఆధ్వర్యంలో బుధవారం ఫ్రీడం పార్కు నుండి తహసీల్దార్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్‌కు మెమొరాండం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ చిన్నమైల్ అంజిరెడ్డి, తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ రాష్ట్ర సహ అధ్యక్షుడు వై.అశోక్‌కుమార్, జిల్లా అధ్యక్షులు ఎం.సోమశేఖర్, మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ, బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి, కాంగ్రెస్ నగర అధ్యక్షుడు నరసింహారెడ్డి, పూర్వ విద్యార్థులు బైండ్ల కుమార్, శ్రీనివాస్‌గుప్తాలు మాట్లాడుతూ.. సుమారు 50 సంవత్సరాల పాటు ఉన్నత పాఠశాలగా వెలుగొంది వేలాది మంది విద్యార్థులను తీర్చిదిద్దిన ప్రభుత్వ పాఠశాల స్థలానికి ఇలాంటి దుస్థితి రావడం శోచనీయమని అన్నారు. 13 ఏళ్ల క్రితం పాఠశాల భవనం శిధిలావస్థలో ఉందని విద్యార్థులను తాత్కాలికంగా ప్రాథమిక పాఠశాల భవనానికి తరలించి ఇన్నేళ్లయినా నూతన భవనం నిర్మించకుండా ఇరుకైన ఆటస్థలం లేని ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలోనే ఉన్నత పాఠశాలను కొనసాగించడం వల్ల విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అవకాశం దొరికినప్పుడల్లా ఆ స్థలాన్ని ఆక్రమించుకోవాలని కొందరు ప్రయత్నించడం పట్ల విచారం వ్యక్తం చేస్తున్నామన్నారు. సుప్రీమ్ కోర్టు అనుమతితో నిర్మించిన ప్రహరీ గోడను రాత్రికి రాత్రి కూల్చి వేయడం దారుణమన్నారు. కాంపౌండ్ వాల్ కూలుస్తుంటే పాత భవనం నేలమట్టమైందని తప్పుడు నివేదిక ఇవ్వడం అక్షేపనీయమని చెప్పారు. ఇప్పటికైనా ప్రభుత్వం బాధ్యత తీసుకుని సుప్రీంకోర్టులో సమర్థుడైన లాయర్‌ను నియమించి ఆ స్థలాన్ని పూర్తిగా స్వాధీనం చేసుకోవాలని కోర్టు అనుమతితో కాంపౌండ్ వాల్ నిర్మించినట్టే అదే స్థలంలో సిఎస్ఆర్ నిధులతో హై స్కూల్ భవనాన్ని నిర్మించి విద్యార్థుల భవిష్యత్తుకు మార్గం సుగమం చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే ఆక్రమించి గుడారాలు ఏర్పాటు చేసుకున్న 9 గుంటల పాఠశాల స్థలాన్ని తిరిగి స్వాధీనం చేసుకోవాలని జిల్లా అధికారులను డిమాండ్ చేస్తున్నామని అన్నారు. ఈకార్యక్రమంలో విద్యా పరిరక్షణ కమిటీ, టిపిటిఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎం.సోమ శేఖర్, ప్రధాన కార్యదర్శి అనుముల రాంచందర్, టిపిటిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు లక్ష్మయ్య యాదవ్, జిల్లా నాయ కులు రాజారెడ్డి, సంజీవయ్య, అశోక్, నాసర్ పటేల్, శ్రీనివాస్ చారి, ప్రకాష్‌రావు, మల్లికార్జున్, జనార్దన్, రాజు, సంతోష్, గోవింద్‌రెడ్డి, విద్యాసాగర్, పోచయ్య, జయరామ్‌రెడ్డి, టీఎస్ఈసీ నాయకులు లక్ష్మి, మానస, శ్రీధర్ మహేంద్ర, మెదక్ జిల్లా ఉపాధ్యక్షులు బి.ముత్యాలు, పటాన్ చెరు నియోజక వర్గ నాయకులు ఆశిష్‌గౌడ్, బి.విజయ్‌కుమార్, ఆర్వీఎస్ రవి, ఎం.రామ్మోహన్, బిట్టు నరహరి, అంగడి బాలరాజు, సరస్వతి, పద్మ, నరేష్, రాజశేఖర్ రెడ్డి, నర్సింలు, నాగభూషణం, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీలక్ష్మీవెంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు

గజ్వేల్ టౌన్, ఏప్రిల్ 15 (ప్రభాతవార్త): శ్రీలక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. బుధవారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు మహా అన్నప్రసాదం అందజేశారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆలయ రాజగోపుర నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు శేషం శ్రీనివాసచార్యులు, ఆలయ కమిటీ చైర్మన్ టిఎండి లక్ష్మణ్ మాట్లాడుతూ కలియుగ దైవం శ్రీ వెంకటేశ్వరస్వామి అనుగ్రహంతో అందరూ బాగుండాలని అన్నారు. శ్రీ లక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలకు సహకరిస్తున్న ప్రతి ఒక్కరికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యజ్ఞాచార్య ఉదయ్‌కుమార్ ఆచార్యులు, ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి గార్లపాటి వెంకటేశ్వర్లు, కోశాధికారి అత్తెల్లి కిషన్, ఉపాధ్యక్షులు ఏడెల్లి శ్రీనివాస్, మాందాల తిరుపతిరెడ్డి, సహాయ కార్యదర్శి గందె యాదగిరి, దేవులపల్లి రాజారాం, ఆలయ కమిటీ సభ్యులు, వికాస తరంగిణి సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

హత్య కేసులో నలుగురికి యావజ్జీవ శిక్ష

దుబ్బాక, ఏప్రిల్ 15, ప్రభాతవార్త : దుబ్బాక పోలీస్‌స్టేషన్ పరిధిలో 2017వ సంవత్సరంలో జరిగిన హత్య కేసులో నలుగురు నిందితులకు సిద్దిపేట జిల్లా ప్రధాన సెషన్స్ కోర్టు జడ్జి సాయిరమాదేవి యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. సూరం బాలరాజు, కడవేర్గు మల్లేశం, కడవేర్గు శ్రీనివాస్, కడవెర్గు సుజాతలకు యావజ్జీవ శిక్షతో పాటు రూ 6వేల జరిమానా విధిస్తూ బుధవారం తీర్పు ఇచ్చింది. కేసులో ప్రాసిక్యూటర్ తరుపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ జీవన్‌రెడ్డి, వెంకటలింగంలు బలమైన సాక్షాలను కోర్టులో ప్రవేశపెట్టారు. అప్పటి దుబ్బక సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఆర్.నిరంజన్ దర్యాప్తు నిర్వహించారు. కేసు ఫాలోఅప్‌లో ప్రస్తుత సి.ఐ.టి రాజేష్, ఎస్ఐకె. కీర్తిరాజు, సిఐ అంజిరెడ్డి కోర్టు లైజనింగ్ ఆఫీసర్ డి.శ్రీనివాస్‌రెడ్డి కీలక పాత్ర పోషించారు. బాధితులకు న్యాయం జరిగేలా కృషిచేసిన పోలీస్ సిబ్బంది, న్యాయవాదులను పోలీస్ కమీషనర్ రష్మి పెరుమాళ్ ఐపిఎస్ అభినిందించారు.

బాలికను మోసం చేసిన యువకుడి అరెస్ట్

ములుగు, ఏప్రిల్ 15 (ప్రభాతవార్త): ప్రేమ పేరుతో బాలికను ఓ యువకుడు మోసంచేసి గర్భవతిని చేసిన సంఘటన మండల పరిధిలోని నర్సాపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. గజ్వేల్ రూరల్ సిఐ రవిరాజు తెలిపిన వివరాల ప్రకారం ములుగు మండల పరిధిలోని నర్సాపూర్ గ్రామానికి చెందిన మైనర్ బాలిక గజ్వేల్‌లో చదువుతుండగా అదే గ్రామానికి చెందిన పగిడిపల్లి భానుప్రసాద్ అనే యువకుడు ప్రేమిస్తున్నానని మాయమాటలు చెప్పి ఆ బాలికను గజ్వేల్‌లోని ఓ లాడ్జికి తీసుకెళ్లి శారీరకంగా అనుభవించాడు. ఈ క్రమంలో బాలిక గర్భం దాల్చడంతో విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు ములుగు పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు బాలికను మోసం చేసిన యువకునితో పాటు గజ్వేల్‌లోని లాడ్జి నిర్వాహకునిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. బుధవారం యువకున్ని అరెస్ట్ చేసి గజ్వేల్ కోర్టులో హాజరుపరిచినట్లు పేర్కొన్నారు.

వివరాలు తెలుపుతున్న సిఐ రవిరాజు

ట్రాఫిక్, రహదారి భద్రతా నియమాలపై అవగాహన

విద్యార్థులకు ట్రాఫిక్ నియమాలను వివరిస్తున్న ఇన్‌స్పెక్టర్ దాసు

చాంద్రాయణగుట్ట, ఏప్రిల్ 15, ప్రభాతవార్త : ట్రాఫిక్, రహదారి భద్రతా నియమాలను ప్రతి ఒక్కరు విధిగా పాటించాలని చాంద్రాయణగుట్ట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఎం.దాసు కోరారు. అరైవ్ అండ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా బుధవారం చాంద్రాయణగుట్ట, సీఆర్‌పీఎఫ్ కేంద్రీయ విద్యాలయం విద్యార్థులకు ట్రాఫిక్ ఉల్లంఘనలు, రహదారి భద్రతా నియమాల గురించి అవగాహన కల్పించారు. తల్లిదండ్రులకు ట్రాఫిక్, రోడ్డు భద్రతా నియమాలను వివరించి అవి ఖచ్చితంగా పాటించేలా విద్యార్థులు కృషి చేయాలన్నారు. వేగం కన్నా ప్రాణం ముఖ్యమని, నిదానమే ప్రధానమని, అపసవ్య దిశ డ్రైవింగ్ ప్రమాదకరమని, హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని, మైనర్లు వాహనాలు నడపకూడదని, సెల్‌ఫోన్లో మాట్లాడుతూ, మద్యం సేవించి వాహనాలు నడపరాదని సూచించారు. సురక్షిత ప్రయాణాన్ని ప్రోత్సహిస్తూ పలు అంశాలను పేర్కొన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన ప్లకార్డులు ఆకట్టుకున్నాయి. అనంతరం చాంద్రాయణగుట్ట ట్రాఫిక్ ఏసీపీ చంద్రకుమార్‌తో కలసి అల్‌జుబైల్ కాలనీ ఫలక్‌నుమా బ్రిడ్జి వద్ద హెల్మెట్ ధరించని వాహనదారులకు హెల్మెట్లను అందజేశారు. కార్యక్రమంలో కేంద్రీయ విద్యాలయం బోధన, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

స్వయం సహాయక సంఘాలు ఆర్థికంగా ఎదగాలి

: ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

ఇందిరా మహిళా శక్తి టిఫిన్ సెంటర్ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే

అల్వాల్, ఏప్రిల్ 15 ప్రభాతవార్త: స్వయం సహాయక సంఘాలు ఆర్థిక ఎదుగుదలకు తన వంతు సహాయ సహకారాలు ఉంటాయని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం లయోలా కళాశాల సమీపంలో మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్, అల్వాల్ సర్కిల్ ఆధ్వర్యంలో శివాత్మక మహిళ పొదుపు సంఘం ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి టిఫిన్ సెంటర్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. మహిళా సంఘాలకు సంబంధించి సమస్యలు తన దృష్టికి తేవాలని పరిష్కారం చూపుతానని మర్రి రాజశేఖర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి, సర్కిల్ డిసి భోగేశ్వర్, ప్రాజెక్టు అధికారి సుధాకర్ బిఆర్ఎస్ నేతలు పరమేష్, శరణగిరి, సురేష్, లక్ష్మణ్ యాదవ్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి : అల్వాల్ ఇన్‌స్పెక్టర్ ప్రశాంత్

అవగాహన ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

అల్వాల్, ఏప్రిల్ 15 ప్రభాతవార్త: అరైవ్ అలైవ్ ద్వారా ప్రధానంగా విద్యార్థులులో ట్రాఫిక్ నియమ నిబంధనలుపై అవగాహన కల్పిస్తున్నామని అల్వాల్ ఇన్‌స్పెక్టర్ ప్రశాంత్ తెలిపారు. బుధవారం ఓల్డ్ అల్వాల్ ఉన్నత పాఠశాల విద్యార్థులుతో కలిసి పట్టణంలో ర్యాలీ నిర్వహించడం జరిగింది. జిల్లా రోడ్డు రవాణా శాఖ అధికారిణి లావణ్య ముఖ్య అతిధిగా విచ్చేశారు. రోడ్డు ప్రమాదాలు నివారణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలుపై చిన్న తనం నుంచి అవగాహన అవసరమని ఇన్‌స్పెక్టర్ పేర్కొన్నారు. హెల్మెట్ ధరించడం, వేగ నియంత్రణ పాటించడం ద్వారా ప్రమాదాలు తగ్గుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు రాఘవేంద్ర రెడ్డి, కిషోర్, ఎంఐఓ మురళీక్రిష్ణ మూర్తి ఇతరులు పాల్గొన్నారు.

నెహ్రూ విగ్రహానికి కాంగ్రెస్ నేతల పుష్పాంజలి


లాల్‌దర్వాజా మోడ్ వద్ద నెహ్రూ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నేతలు

చాంద్రాయణగుట్ట, ఏప్రిల్ 15, ప్రభాతవార్త : లాల్‌దర్వాజా మోడ్ వద్ద 1964లో ఏర్పాటు చేసిన పండిత్ జవహర్‌లాల్ నెహ్రూ విగ్రహ పునరాభివృద్ధి పనులు పూర్తి చేసుకున్న సందర్భంగా బుధవారం చార్మినార్, బహదూర్‌పురా నియోజక వర్గాల కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్‌లు ముజీబుల్లా, పులిపాటి రాజేష్‌లు ఆ పార్టీ నేతలతో కలిసి విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు. పండిత్ జవహర్ లాల్ నెహ్రూ దేశ స్వాతంత్ర ఉద్యమంలో, దేశా సర్వతోముఖాభివృద్ధికి ఎనలేని సేవలందించారన్నారు. గ్రేటర్ హైదరాబాద్ కాంగ్రెస్ కార్యదర్శి కె.శ్యామ్‌రావు ముదిరాజ్ మాట్లాడుతూ జిహెచ్ఎంసి ఈఈ షేక్ సలావుద్దీన్ సహకారంతో విగ్రహానికి కలరింగ్, ఐరన్ జాలి, డోర్, నిచ్చెన, అండర్ ఫ్లోరింగ్ వర్క్, పిట్ట గోడ నిర్మించినట్లు వెల్లడించారు. అభివృద్ధి పనులకు సహకరించిన ఈఈ సలావుద్దీన్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పీసీసీ కార్యదర్శి బి.వెంకటేష్ ముదిరాజ్, జిల్లా ఉపాధ్యక్షులు ఆర్. శ్రీకాంత్, బి బ్లాక్ అధ్యక్షులు అనిల్ కుమార్, నేతలు ముత్యం యాదవ్, రాజ్ నారాయణ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ట్రేడ్ డీల్‌కు వ్యతిరేకంగా కిసాన్ న్యాయ సత్యాగ్రహ దీక్ష

సత్యాగ్రహ దీక్షలో పాల్గొని సంఘీభావం తెలుపుతున్న విజయరెడ్డి

ఖైరతాబాద్, ఏప్రిల్ 15 (ప్రభాతవార్త): భారత రైతులకు నష్టం కలిగించే విధంగా కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలను నిరసిస్తూ జాతీయ యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో జరుగుతున్న కిసాన్ న్యాయ సత్యాగ్రహ దీక్ష నాలుగో రోజు కొనసాగింది. రంగారెడ్డి జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు కొండకళ్ల నాగేందర్ రెడ్డి చేపట్టిన ఈ దీక్షకు పలువురు నాయకులు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖైరతాబాద్ నియోజకవర్గ కంటెస్టెడ్ ఎమ్మెల్యే, మాజీ కార్పొరేటర్ పి. విజయ రెడ్డి బుధవారం పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతుల ప్రయోజనాలను కాపాడే విధంగా కేంద్ర ప్రభుత్వం తక్షణమే సరైన నిర్ణయాలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతుల హక్కుల కోసం పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆకుల చంద్రశేఖర్, గౌని సంతోష్ గౌడ్, నాగేష్ నాయక్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుర్రం శ్యామ్చరణ్ రెడ్డి, జాతీయ ప్రతినిధి రాని రాథోడ్, సోషల్ మీడియా జిల్లా కోఆర్డినేటర్ సంతోష్, విష్ణు, ఎల్బీనగర్ నియోజకవర్గ అధ్యక్షుడు శివ, రాజేంద్రనగర్ ఉపాధ్యక్షుడు చందు యాదవ్, కిరణ్, శ్రీనివాస్, భరత్ హాజరయ్యారు.

మిషన్‌భగీరథ కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలి : ఐఎన్‌టియూసీ

ముషీరాబాద్, ఏప్రిల్ 15, ప్రభాతవార్త: తెలంగాణ గ్రామీన తాగునీటి సరఫరా పథకం అయిన మిషన్ భగీరథలో పనిచేస్తున్న 16వేల మంది కాంట్రాక్ట్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని ఐఎన్‌టియుసీ రాష్ట్ర ముఖ్య ఉపాధ్యక్షులు మెగుళ్ల రాజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఆర్.డి.చంద్రశేఖర్, ఆర్‌డబ్ల్యూఎస్ యూనియన్ అధ్యక్షులు తాలరి రాములు విజ్ఞప్తి చేశారు. ఈమేరకు వారు బుధవారం టిపిసిసి అధ్యక్షులు బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్‌ను కలసి వినతి పత్రం అందచేశారు. తెలంగాణ ఆర్‌డబ్ల్యూఎస్, మిషన్ భగీరథ అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రభుత్వం గుర్తించటంతో పాటు అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగ కార్మికులకు ప్రభుత్వం సకాలంలో వేతనాలు అందించేలా చొరవ తీసుకోవాలని వారు కోరారు. మిషన్ భగీరథలో పనిచేస్తున్న వారికి అరకొర వేతనాలు చెల్లిస్తూ వారి శ్రమను దోపిడీ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి, సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన

మహేష్‌కుమార్‌గౌడ్‌కు వినతిపత్రం అందచేస్తున్న ఐఎన్‌టియూసీ నేతలు

వేతనాలు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని, అదే విధంగా రానున్న ఔట్ సోర్సింగ్ కార్పోరేషన్ ద్వారానే వేతనాలు చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆర్‌డబ్ల్యూఎస్, మిషన్ భగీరథ అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ వర్కర్స్, ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు దయాకర్‌గౌడ్, ఉపాధ్యక్షులు టి.చంద్రశేఖర్, తుదల వీరస్వామి, ప్రధాన కార్యదర్శి పి.సతీష్, దుర్గాప్రసాద్, బాలకృష్ణ, వల్లా మధుసూదన్‌రెడ్డి, షేక్‌ఖాజా తదితరులు పాల్గొన్నారు.

మీరు పెట్టుకోండి.. మీ తల్లిదండ్రులకు తెలియజెప్పండి

- అరైవ్-అలైవ్ కార్యక్రమంలో ట్రాఫిక్ సంయుక్త కమిషనర్ జోయల్ డేవిస్

జూబ్లీహిల్స్, ఏప్రిల్ 15, ప్రభాతవార్త: హెల్మెట్ అనేది మీ తలనే కాదు.. మీ జీవితాన్ని కాపడుతుంది.. అందుకే.. వాహనంపై వెళ్లేటప్పుడు మీరే కాకుండా వాహనం నడిపే మీ తల్లిదండ్రులకు ఈ హెల్మెట్‌ను ధరించాలని చెప్పాలని చిన్నారులకు నగర ట్రాఫిక్ సంయుక్త కమిషనర్ జోయల్ డేవిస్ సూచించారు. బంజారాహిల్స్‌లోని కేబీఆర్ ఉద్యానవన కూడలిలో బుధవారం ఆయన అదనపు డీసీపీ వేణుగోపాల్‌రెడ్డి, జూబ్లీహిల్స్ జోన్ ట్రాఫిక్ ఏసీపీ కట్టా హరిప్రసాద్, బంజారాహిల్స్ ఏసీపీ సామల వెంకటరెడ్డిలతో కలిసి అరైవ్-అలైవ్ కార్యక్రమంలో భాగంగా ట్రాఫిక్‌కు సంబంధించి పలు అంశాలపై అవగాహన కల్పించారు. అంతేకాకుండా రోడ్డుపై తమ తల్లిదండ్రులతో కలిసి వెళ్తున్న చిన్నారులకు ఉచితంగా హెల్మెట్లను అందజేశారు. వాహనం నడిపే తల్లిదండ్రులు ఎవరైనా ప్రయాణ సమయంలో హెల్మెట్ ధరించాలని గట్టిగా చెప్పాలని చిన్నారులకు సూచించారు. ట్రాఫిక్ నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనం నడపవద్దని, రాంగ్ డైరక్షన్‌లో వెళ్లవద్దని సూచించారు. ఇది వారికి ప్రమాదమే కాకుండా ఎదుటి వాహణదారులకు ప్రమాదమని సూచించారు. కార్యక్రమంలో బంజారాహిల్స్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కోరని సునీల్, ఎస్సై గోవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు హెల్మెట్లు పెడుతున్న సంయుక్త కమిషనర్ జోయల్ డేవిస్

మే 5న హైదరాబాద్‌లో ఆటో, ప్రైవేట్ రవాణా డ్రైవర్ల మహాధర్నా

చిక్కడపల్లి ఏప్రిల్ 15 (ప్రభాతవార్త) : రాష్ట్రంలోని ఆటో, క్యాబ్, ప్రైవేట్ రవాణా రంగ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం మే 5వ తేదీన హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద భారీ మహాధర్నా నిర్వహించనున్నట్లు భారతీయ ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ మజ్దూర్ మహాసంఘ్ (తెలంగాణ) ప్రకటించింది. బుధవారం ఆర్టీసీ క్రాస్ రోడ్స్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో జాతీయ ప్రధాన కార్యదర్శి రవిశంకర్ అల్లూరి మాట్లాడారు. ఆటో , ప్రైవేట్ రవాణా కార్మికుల కోసం తక్షణమే ప్రత్యేక సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలి, గతంలో హామీ ఇచ్చిన విధంగా ఏటా రూ. 12,000/ ఆర్థిక సాయాన్ని తక్షణమే అమలు చేయాలి, నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న ఓలా, ఉబర్, రాపిడో బైక్ ట్యాక్సీలను పూర్తిగా నిషేధించాలి, రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ నగరాల్లో ట్రాన్స్‌పోర్ట్ నగర్‌లు నిర్మించాలి, రైల్వే స్టేషన్లు, బస్టాండ్లు మరియు విమానాశ్రయాల్లో ఆటోలు, ట్యాక్సీలకు ఉచిత పార్కింగ్ సౌకర్యం కల్పించాలి, జాతీయ రహదారుల వెంట డ్రైవర్ల విశ్రాంతి కోసం మరుగుదొడ్లు, మంచినీరు, సబ్సిడీ క్యాంటీన్లతో కూడిన విశ్రాంతి గృహాలు నిర్మించాలి, ప్రతి డ్రైవర్‌కు ప్రమాద బీమా, సహజ బీమా మరియు ఆరోగ్య బీమా కల్పించాలి, సొంత ఇల్లు లేని డ్రైవర్లకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు మంజూరు చేయాలి. ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన అంశాలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని సంఘం నేతలు విమర్శించారు. ముఖ్యంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వల్ల ఆటో డ్రైవర్ల ఉపాధి దెబ్బతిన్నదని, దీనికి ప్రత్యామ్నాయంగా ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదని వారు మండిపడ్డారు. ట్రాఫిక్ పోలీసులు భారీగా చలాన్లు విధిస్తూ కార్మికుల నడ్డి విరుస్తున్నారని ఆరోపించారు. తౌహాన్ కమిటీ భూములను ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోకి వెళ్లకుండా, వాటిని వాహనాల పార్కింగ్ స్థలాలుగా ఉపయోగించాలని వారు డిమాండ్ చేశారు. మే 5న మహాధర్నాకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న రవాణా రంగ కార్మికులు, డ్రైవర్లు తమ వాహనాలను బంద్ చేసి పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భారతీయ ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ మజ్దూర్ మహా సంఘ్ ఉపాధ్యక్షులు నంద కిషోర్, కార్యదర్శి యండి హబీబ్, ఆటో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి పెంటయ్య గౌడ్, వజ్ర లింగం, శంకర్, శివకుమార్, మహా సంఘ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శ్రీధర్, అఖిల భారత మహిళా ప్రభారి శ్రీమతి మీనా తదితరులు పాల్గొన్నారు..

ప్రసంగిస్తున్న భారతీయ ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ మజ్దూర్ మహాసంఘ్ జాతీయ ప్రధాన కార్యదర్శి రవిశంకర్ అల్లూరి

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో చిక్కారు.. హంగామా చేశారు..

జూబ్లీహిల్స్, ఏప్రిల్ 15, ప్రభాతవార్త: డ్రంక్ అండ్ డ్రైవ్‌లో మద్యం సేవించి పట్టుబడ్డ ఒక వ్యక్తి, అక్కడికి వచ్చిన అతను కుమారుడు ట్రాఫిక్ పోలీసుల పట్ల నానా హంగామా సృష్టించిన సంఘటన పంజాగుట్ట ఠాణా పరిధిలో చోటుచేసుకొంది. పంజాగుట్ట పోలీసుల కథనం ప్రకారం.. గ్రీన్‌లాండ్స్ జంక్షన్ వద్ద ట్రాఫిక్ పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తున్నారు. అదే సమయంలో అటుగా వచ్చిన ఒక వాహనదారుడైన శశికిరణ్ నిలిపి ట్రాఫిక్ ఎస్సై జబీన్ పరీక్షించగా అతనికి రక్తంలో మద్యం మోతాదు శాతం 39గా వచ్చింది. దీంతో వాదనకు దిగిన వాహనదారుడు మరోసారి పరీక్ష చేయాలంటూ పట్టుబట్టాడు. మరోసారి పరీక్షించగా అంతే శాతం వచ్చింది. అదే సమయంలో అక్కడికి చేరుకున్న అతని కుమారుడు సుమిత్ పోలీసులతో అసభ్యంగా ప్రవర్తించడమే కాకుండా గొడవకు దిగి విధులను అడ్డుకున్నాడు. తండ్రీ కుమారులు ఇద్దరు పోలీసు విధులను అడ్డుకొని, వాహనం స్వాధీనం చేసుకోకుండా అడ్డుకొని నానా హంగామా సృష్టించడమే కాకుండా తప్పించుకొనేందుకు ప్రయత్నించారు. ఈ సంఘటనపై ట్రాఫిక్ పోలీసులు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం మత్తులో నాల్గో అంతస్థు నుంచి పడి మృతి

జూబ్లీహిల్స్, ఏప్రిల్ 15, ప్రభాతవార్త: మద్యం మత్తులో ఉన్న ఒక వ్యక్తి మూత్రవిసర్జనకు వెళ్లి నాల్గో అంతస్థు మీది నుంచి ప్రమాదావశాత్తు కింద పడి మృతిచెందిన సంఘటన బంజారాహిల్స్ ఠాణా పరిధిలో చోటుచేసుకొంది. బంజారాహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. బోయిని యాదగిరి(48) అనే వ్యక్తి బంజారాహిల్స్ రోడ్ నంబరు 14లోని నందినగర్‌లోని ఒక భవనం మూడో అంతస్థులో నివసిస్తున్నాడు. అతని లక్ష్మి చేపలు అమ్మగా వచ్చే డబ్బుతో మంగళవారం రాత్రి మద్యం సేవించాడు. నాల్గో అంతస్థులో ఉన్న టెర్రస్‌పై నిద్రించడానికి వెళ్లిన యాదగిరి రాత్రి 11 గంటల ప్రాంతంలో మూత్రవిసర్జన చేయడానికి భవనం చివరికి వెళ్లాడు. పిట్టగోడ పక్కన నిలబడి మూత్రవిసర్జన చేస్తుండగా ప్రమాదావశాత్తు ఒక్కసారిగా తుల్లి నాల్గో అంతస్థు నుంచి జారి కింద పడిపోయాడు. దీంతో అతను అక్కడిక్కడే మృతిచెందాడు. ఆయనకు ఇద్దరు పిల్లలు ఉండగా ఇటీవలే ఒక అమ్మాయికి నిశ్చితార్థం జరిగింది. యాదగిరి మృతిపై కుమార్తె ఇచ్చిన ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కుక్కను కొడుతుంటే అడ్డుకున్నాడని దాడి

జూబ్లీహిల్స్, ఏప్రిల్ 15, ప్రభాతవార్త: కుక్కను కొడుతున్న వ్యక్తిని వారించడానికి వెళ్లిన ఒక వాచ్‌మెన్‌పై అగంతకుడు దాడి చేసిన సంఘటన బంజారాహిల్స్ ఠాణా పరిధిలో చోటుచేసుకొంది. బంజారాహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. బంజారాహిల్స్ రోడ్ నంబరు 12లోని ఎమ్మెల్యే కాలనీలో ఒక అపార్ట్‌మెంట్ వద్ద రవి అనే వ్యక్తి కాలపదారుగా పనిచేస్తున్నాడు. మంగళవారం రాత్రి అపార్ట్‌మెంట్ ముందున్న వీధి కుక్కను ఒక అగంతకుడు కర్రతో కొడుతున్నాడు. ఇది గమనించిన రవి అడ్డుకొనేందుకు వెళ్లాడు. దీంతో కోపగించుకున్న అగంతకుడు అదే కర్రతో రవిపై దాడి చేసి అక్కడి నుంచి పరారయ్యాడు. దీంతో రవి తలకు నాలుగు కుట్లు పడ్డాయి. బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. స్థానికంగా ఉన్న సీసీ కెమెరాల ఆధారంగా నిందితుడిని గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నారు.

భక్తిప్రపత్తులతో హరిహర పుత్రుని జన్మదినోత్సవం

కేశవగిరిపై అయ్యప్ప స్వామి పడిపూజ నిర్వహిస్తున్న భక్తులు

చాంద్రాయణగుట్ట, ఏప్రిల్ 15, ప్రభాతవార్త : హరిహర పుత్రుడు శ్రీ అయ్యప్పస్వామి జన్మనక్షత్రాన్ని పురస్కరించుకొని మంగళవారం రాత్రి పాతబస్తీ చాంద్రాయణగుట్ట కేశవగిరిపై గల శ్రీ చెన్నకేశవస్వామి దేవస్థానంలో స్వామి పడిపూజను భక్తి ప్రపత్తులతో నిర్వహించారు. గురుస్వాములు సత్యనారాయణ, శేఖర్, బాల్‌రాజ్, బాలాజీ, పవన్, రాహుల్‌లు అయ్యప్పస్వామికి అభిషేకం, అలంకరణ, హారతి పూజలు నిర్వహించారు. సమీప భక్తులతో కలిసి స్వామి భజనలు చేశారు. తీర్థ ప్రసాదాలు అందజేశారు. అదేవిధంగా కందికల్‌గేట్ శ్రీ చిత్రగుప్త దేవాలయం ఆవరణలోని శ్రీ అయ్యప్పస్వామి దేవాలయంలో, గౌలిపురా శ్రీరాంనగర్ కాలనీలోని శ్రీ అయ్యప్పస్వామి దేవాలయంలో సైతం హరిహర తనయుడికి ఆలయ అర్చకస్వాములు విశేష పూజలు నిర్వహించారు. స్వామి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అయ్యప్పస్వామిని దర్శించుకొని పూజించారు. నిర్వాహకులు భక్తులకు అన్న ప్రసాద వితరణ చేపట్టారు.

భక్తి, సాహిత్యం మేళవింపే వాయుపుత్ర శతకం



చిక్కడపల్లి, ఏప్రిల్ 15 (ప్రభాతవార్త) : సాహిత్యం ద్వారా భక్తిని చాటిచెప్పడమే కాకుండా, సామాజిక అంశాలను స్పృశించడం అభినందనీయమని గాన సభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి అన్నారు. ప్రముఖ జర్నలిస్ట్ హాస్యావధాని శంకర నారాయణ రచించిన వాయు పుత్ర శతకం ఆవిష్కరణ సభ శ్రీ త్యాగరాయ గానసభ లోని కళా సుబ్బారావు కళా వేదిక పై గాన సభ నిర్వహణలో భాషా సాంస్కృతిక సౌజన్యం తో జరిగింది ముఖ్య అతిథిగా గాన సభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి పాల్గొని సంపుటి ఆవిష్కరణ చేసి మాట్లాడారు శంకర నారాయణ శతక పద్య రచనా విశారదుడు అన్నారు నలభై ఐదు శతకాలు ఆయన రాయగా వాటిలో నలభై శతకాలు వివిధ దేవతలపై రాసినవి అని అభినందించారు శంకర నారాయణ సంపుటిని లాంఛనం గా శ్రీరస్తు సాంస్కృతిక సంస్థ కార్యదర్శి కవి కె వి రమణ రెడ్డి అంకితం ఇచ్చారు రమణా రెడ్డి మాట్లాడుతూ ప్రముఖ జర్నలిస్ట్ శంకర నారాయణ తన శత క సంపుటి అంకితం కు తనను ఎంచుకోవటం సంతోషం గా ఉంది అన్నారు శంకర నారాయణ మాట్లాడుతూ రమణా రెడ్డి స్వగ్రామం తిప్పాయ పాలెం లో వెలిసిన ఆంజనేయుడు గాన సభలో కొలువైన భారీ ఎత్తున నిలిచిన వాయు పుత్రుని విగ్రహం తన రచనకు స్ఫూర్తి అని తెలిపారు వేదికపై గాయకుడు రామ కుమార్ పాల్గొన్నారు.

వాహనదారులు సురక్షితంగా ఇంటికి చేరుకోవాలి

అత్తాపూర్ ఏప్రిల్ 15,ప్రభాతవార్త : వాహనదారులు తప్పకుండా ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ సురక్షితంగా ప్రాణాలతో ఇంటికి చేరుకోవాలని పలువురు అధికారులు పేర్కొన్నారు. అరైవ్ అలైవ్" ప్రచారంలో భాగంగా రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఎస్‌హెచ్ఓ రాజు ఆధ్వర్యంలో శివరాంపల్లి జడ్పిహెచ్ఎస్ హైస్కూల్లో ,అరంఘర్ చౌరస్తాలో ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులతో కలిసి వాహనదారులకు అవగాహన కల్పించారు. అనంతరం పలువురు వాహనదారులకు హెల్మెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు పోలీసు అధికారులు మాట్లాడుతూ... వాహనదారులు గమ్యం చేరుకోవడమే లక్ష్యంగా పెట్టుకోకూడదని సురక్షితంగా ప్రాణాలతో ఇంటికి చేరుకోవాలని సూచించారు. పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు వివిధ అంశాలపై డ్రైవర్లు, విద్యార్థులకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. ఒక్క క్షణం అజాగ్రత్త జీవితాంతం తీరని నష్టాన్ని మిగిలిస్తుందని హెచ్చరించారు. వాహనదారులు వేగపరిమితిని పాటించాలని ,మొబైల్ ఫోన్లు వాడుతూ డ్రైవింగ్ చేయవద్దని అదేవిధంగా తల్లిదండ్రులు చిన్నపిల్లలకు వాహనాలు ఇవ్వరాదని , వాహనదారులు హెల్మెట్, సీటు బెల్టు ధరించాలన్నారు. రూల్స్ ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎడిసిపి రామదాస్ తేజావత్, రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఎస్‌హెచ్ఓ సిహెచ్ రాజు, రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఆర్ఐ గణేష్ , రాజేంద్రనగర్ సిఐ ముత్తు యాదవ్, అత్తాపూర్ సిఐ నాగేశ్వర్ రావు, కొండాపూర్ ఎంవిఐ మనోజ్, శివరాంపల్లి జిహెచ్ఎం, జడ్పిహెచ్ఎస్ శ్రీను నాయక్, తదితరులు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేకి కాంగ్రెస్ సర్కారుకు గుణపాఠం తప్పదు

- మణికొండ బిఆర్ఎస్ అధ్యక్షులు సీతారాం ధూళిపాళ్ల

నార్సింగి, ఏప్రిల్ 15 ప్రభాతవార్త : కార్మిక వ్యతిరేకి కాంగ్రెస్ సర్కారుకు వచ్చే గ్రేటర్ ఎన్నికల నుంచే గుణపాఠం తప్పదని మణికొండ బిఆర్ఎస్ అధ్యక్షులు సీతారాం ధూళిపాళ్ల పేర్కొన్నారు. బుధవారం నార్సింగిలోని టిజిఎస్‌పిడిసిఎల్ డిఈ కార్యాలయం వద్ద గత 8.రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్న ఆర్టిసన్ ఉద్యోగుల నిరవధిక సమ్మెకు బిఆర్ఎస్ నాయకులు మద్దతు తెలుపుతూ నల్లబట్టలు ధరించి సమ్మెలో కూర్చున్నారు. అనంతరం సీతారాం ధూళిపాళ్ల మాట్లాడుతూ రైతులు, ఉద్యోగులు, నిరుద్యోగులు, కార్మికులు, కర్షకులు, విద్యార్థులు, నిరుద్యోగులు, వృద్ధులు, మహిళలు ఇలా అన్ని రంగాల వారిని కాంగ్రెస్ ప్రభుత్వం వంచిస్తుందన్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రజలకిచ్చిన ఆరు గ్యారెంటీలు, 420. హామీలను తుంగలో తొక్కారని, ప్రజలకు మీరిచ్చిన హామీలను అమలు చేయాలని బిఆర్ఎస్ ప్రశ్నిస్తుంటే కాంగ్రెస్ సర్కారు తోకముడుస్తున్నారన్నారు. మూడేళ్ల నుంచి విద్యుత్ శాఖలో పని చేస్తున్న చాలా మంది కార్మికులకు జీతాలు ఇవ్వకపోవడం, ప్రమాద భీమాలను తొలగించడం, వారిపై ఎస్మాను ప్రయోగించడం దారుణమైన చర్యలన్నారు. విద్యుత్ శాఖలో పర్మినెంట్ ఉద్యోగులతో సమానంగా పని చేస్తున్న కార్మికులకు ఎందుకు సమాన వేతనాలు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. కార్మికుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలను తాము తీవ్రంగా ఖండిస్తున్నామని స్పష్టం చేశారు. విద్యుత్ శాఖలో పని చేస్తున్న కార్మికులు తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలంటూ గత 8.రోజులుగా నిరవధిక దీక్షలు చేస్తున్నా సర్కారులోని పెద్దలు ఒక్కరన్నా స్పందించకపోవడం దారుణమన్నారు. ఇకనైనా ప్రభుత్వం దిగి వచ్చి కార్మికులతో అర్థవంతమైన చర్చలు చేయాలని, వెంటనే ఎస్మాను ఎత్తివేసి, ప్రమాదభీమాను వర్తింపచేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు ధన్‌రాజ్, నరేందర్, శ్రీకాంత్, కిరణ్, ఆరిఫ్, శ్రీధర్, సుమ నళిని, దేవిప్రియ, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

నార్సింగి డిఇ కార్యాలయం వద్ద నిరవధిక సమ్మె చేస్తున్న కార్మికులకు మద్దతుగా కూర్చున్న బిఆర్ఎస్ నాయకుల దృశ్యం.

ఉపాధ్యాయులకు అండగా 'ఎడ్‌టాకీస్ '

- ఏఐప్లాట్‌ఫాంను ప్రారంభించిన రామ్ అల్లాడి

ఎడ్‌టాకీస్ ఏఐప్లాట్‌ఫాంను ప్రారంభిస్తున్న రామ్ అల్లాడి

హైదరాబాద్, ఏప్రిల్ 15,ప్రభాతవార్త: భారతీయ విద్యా వ్యవస్థలో కృత్రిమ మేధ (ఏఐ) విప్లవాత్మక మార్పులకు నాంది పలకబోతోంది. అమెరికాకు చెందిన ప్రముఖ ఏఐ ఆధారిత ఎడ్యుకేషన్ ప్లాట్‌ఫార ఎడ్‌టాకీస్ భారతీయ పాఠశాలలు మరియు ఉపాధ్యాయుల కోసం తన వినూత్న సేవలను విస్తరించింది. బుధవారం హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో సంస్థ వ్యవస్థాపకుడు రామ్ అల్లాడి ఈ వివరాలను వెల్లడించారు. ఉపాధ్యాయుల స్థానాన్ని భర్తీ చేయడం కాకుండా, వారి బోధనా సామర్థ్యాన్ని రెట్టింపు చేయడమే తమ ఏఐ ప్లాట్‌ఫాం ప్రధాన ఉద్దేశమని ఆయన స్పష్టం చేశారు. డిజిటల్ లెర్నింగ్‌లో హెచ్చుతగ్గులు గడిచిన ఆరేళ్లలో భారతదేశంలో డిజిటల్ అభ్యాసం గణనీయమైన మార్పులకు లోనైందని విశ్లేషించారు. 2020 కంటే ముందు దేశంలో డిజిటల్ విద్యా వినియోగం కేవలం 20 శాతానికే పరిమితమై ఉండేదని, అది కూడా ప్రధానంగా పట్టణ ప్రాంతాల్లోని ప్రైవేటు పాఠశాలల్లోనే కనిపించేదని గుర్తుచేశారు. కోవిడ్ మహమ్మారి సమయంలో ఇది ఒక్కసారిగా 70 శాతానికి చేరుకోగా, ప్రస్తుతం 55 శాతం వద్ద స్థిరపడిందన్నారు. అయితే, పట్టణ ప్రాంతాల్లో 7085 శాతం మంది డిజిటల్ విద్యను పొందుతుండగా, గ్రామీణ భారతంలో ఇది కేవలం 3045 శాతంగానే ఉండటం ఆందోళనకరమని పేర్కొన్నారు. సరైన ఇంటర్నెట్ సౌకర్యం లేకపోవడం, స్మార్ట్‌ఫోన్ల కొరత డిజిటల్ అవగాహనలోపమే ఇందుకు ప్రధాన కారణాలని ఆయన వివరించారు.

త్యాగరాయ గానసభలో సమాజ దర్పణం పుస్తకావిష్కరణ

చిక్కడపల్లి, ఏప్రిల్ 15 (ప్రభాతవార్త) : చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో ఈ నెల 26 న ఆదివారం శ్రీద్యుతి మ్యూజికల్ అకాడమీ ఇషాన్ ఫౌండేషన్ మరియు విజయ్ క్రియేషన్స్ సాంస్కృతిక సేవా సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించబోతున్నట్లు నిర్వాహక సంస్థ అధినేతలు, ప్రముఖ గాయని గాయకులు పేరి నాగేశ్వర్ రావు, పేరి విజయ లక్ష్మి వివరించారు. పేరి నాగేశ్వర్ రావు, పేరి విజయలక్ష్మి స్వర సారధ్యంలో సినీ సంగీత విభావరి ఉంటుంది. ఈ కార్యక్రమంలో ప్రముఖ గాయనీ గాయకులు కాత్యాయిని దేశ్ పాండే, ప్రసన్న, సౌమ్య, దీన, నీరజ, శ్రీముఖి తదితరులు గానం చేస్తారు. కార్యక్రమంలో పేరి నాగేశ్వర్ రావు రచించిన "సమాజ దర్పణం ద్వితీయ విభాగం పుస్తకాన్ని ముఖ్య అతిథిగా ప్రముఖ గజల్ కళాకారులు గజల్ శ్రీనివాస్ హాజరై ఆవిష్కరిస్తారు. అతిథులుగా గానసభ అధ్యక్షుడు కళా వి ఎస్ జనార్ధన మూర్తి, పేరి కామేశ్వరరావు, కందాల శ్రీనివాస్, ఐతాచారి మూర్తి, ఎ.బి. రాజేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొంటారు.

పారిశుధ్య కార్మికులకు నిత్యావసర వస్తువులు పంపిణీ

పారిశుద్ధ కార్మికులకు నిత్యవసర వస్తువులు పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఎం అరవింద్ కుమార్ యాదవ్ తదితరులు

చిక్కడపల్లి ఏప్రిల్ 15 (ప్రభాతవార్త) : సికింద్రాబాద్ జిల్లా డిసిసి ప్రధాన కార్యదర్శి గుండు జగదీష్ బాబు ఆధ్వర్యంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఎం అరవింద్ కుమార్ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిహెచ్ఎంసి. పారిశుద్ధ కార్మికులకు నిత్యవసర వస్తువులు పంపిణీ చేసారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు. శీలం సత్యనారాయణ. గుండు జయేందర్ బాబు. గుర్రం శంకర్. అభిషేక్ కెనడి. బద్దమోహన్ రెడ్డి. యాదగిరి గౌడ్. బాబురావు. మర్రిశెట్టి నర్సింగ్ రావు. అస్లాం. గడ్డం రాజేష్. రాము. శ్రీనివాస్. సురేష్ యాదవ్ భాస్కర్ రెడ్డి. తదితరులు పాల్గొన్నారు.

పెట్టీ కేసులో ముగ్గురికి జైలు

చాంద్రాయణగుట్ట, ఏప్రిల్ 15, ప్రభాతవార్త : అనుమానాస్పదస్థితిలో తచ్చాడుతున్న ముగ్గురు వ్యక్తులకు కోర్టు రెండు రోజుల చొప్పున జైలుశిక్ష విధించింది. చాంద్రాయణగుట్ట ఇన్‌స్పెక్టర్ గోపి కథనం ప్రకారం... కంచన్‌బాగ్ నివాసి, సెల్స్‌మెన్ షేక్ కలీమ్ (28), మైలార్‌దేవ్‌పల్లి నివాసి సెల్స్‌మెన్ సయ్యద్ షానవాజ్ (19), బండ్లగూడ నివాసి, ఆటో డ్రైవర్ మహ్మద్ రఫీ (46)లు బస్తీలలో అనుమానాస్పదంగా తచ్చాడుతున్నారు. గమనించిన పెట్రోలింగ్ పోలీసులు వారిని ప్రశ్నించగా పొంతనలేని సమాధానాలు ఇచ్చారు. ముగ్గురిని స్టేషన్‌కు తరలించి వారిపై ఈపెట్టీ కేసు నమోదు చేశారు. బుధవారం నాంపల్లిలోని 9వ ఎస్.ఎం.ఎం.కోర్టులో ప్రవేశపెట్టారు. కేసును విచారించిన మేజిస్ట్రేట్ ఒక్కొక్కరికి రెండు రోజుల చొప్పున జైలుశిక్ష విధించారు. నిందితులను పోలీసులు చంచల్‌గూడ జైలుకు తరలించారు. ఎస్ఐ వి.శ్రీనివాస్ రావు కేసును దర్యాప్తు చేసున్నారు.

కోడిగుడ్డు అడిగితే.. తలపై గరిటెతో కొట్టింది.

- ఆయాపై ఫిల్మ్‌నగర్ ఠాణాలో కేసు నమోదు

జూబ్లీహిల్స్, ఏప్రిల్ 15, ప్రభాతవార్త: మధ్యాహ్న భోజనంలో కోడిగుడ్డు అడిగిన ఒక బాలుడిని ఆయా గరిటెతో తలపై కొట్టిన సంఘటన ఫిల్మ్‌నగర్ ఠాణా పరిధిలో చోటుచేసుకొంది. ఫిల్మ్‌నగర్ పోలీసుల కథనం ప్రకారం.. ఫిల్మ్‌నగర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మాగంటి కాలనీకి చెందిన వర్షిత్(11) ఆరో తరగతి చదువుతున్నాడు. బుధవారం మధ్యాహ్నం భోజన సమయంలో కోడిగుడ్డు పెట్టాలని వర్షిత్ భోజనం వడ్డిస్తున్న ఆయా బాలేశ్వరమ్మను కోరాడు. ఇష్టముంటే తిను.. లేదంటే వెళ్లిపో.. కోడిగుడ్డు లేదు.. ఏమి లేదు అంటూ సమాధానమిచ్చింది. బుధవారం మెనూ ప్రకారం కోడిగుడ్డు ఇవ్వాలి కదా అంటూ బాలుడు అడగడంతో కోపగించుకున్న ఆమె నన్నే ప్రశ్నిస్తావా..! అంటూ అక్కడే ఉన్న గరిటెతో వర్షిత్ తలపై బాదింది. బాలుడికి గాయలవ్వడంతో ఆసుపత్రికి తరలించారు. బాధిత బాలుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఏడేళ్ల బాలికతో అసభ్య ప్రవర్తన

- నిందితుడిని అరెస్ట్ చేసిన జూబ్లీహిల్స్ పోలీసులు

జూబ్లీహిల్స్, ఏప్రిల్ 15, ప్రభాతవార్త: ఏడేళ్ల బాలికకు ఐస్‌క్రీం ఆశ చూపి నిర్మానుష్య ప్రాంతంలోకి తీసుకెళ్లి అసభ్యంగా ప్రవర్తించిన ఒక నిందితుడిని జూబ్లీహిల్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. జూబ్లీహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. యూసుఫ్‌గూడ సమీపంలోని లక్ష్మీనర్సింహ నగర్‌లో నివసించే జావిద్(35) పండ్ల వ్యాపారం చేస్తుంటాడు. రహమత్‌నగర్ ప్రాంతానికి చెందిన తల్లిదండ్రులు తమ ఏడేళ్ల కుమార్తెను తీసుకొని ప్రతి రోజు పని కోసం లేబర్ అడ్డా వద్దకు వస్తుంటారు. ఈ క్రమంలోనే జావిద్‌తో వారికి పరిచయం ఏర్పడింది. బాలిక తల్లిదండ్రులు కూలి పనికి వెళ్లే సమయంలో మంగళవారం రాత్రి తమ చిన్నారిని జావిద్‌కు అప్పగించి వెళ్లారు. కాగా ఐస్‌క్రీమ్ తినిపిస్తానని బాలికను బైకుపై తీసుకెళ్లిన జావిద్ రోడ్ నంబరు 10లోని ఒక నిర్మానుష్య ప్రాంతంలో బాలికతో అసభ్యంగా ప్రవర్తించాడు. విషయం ఎవరికి చెప్పవద్దంటూ బాలికను బెదిరించాడు. కాగా రాత్రి ఇంటికి వెళ్లిన బాలిక జరిగిన విషయాన్ని తల్లిదండ్రుల దృష్టికి తీసుకెళ్లింది. దీంతో బాలిక తల్లిదండ్రులు జూబ్లీహిల్స్ పోలీసులకు పిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడైన జావిద్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

ఉద్యోగినిపై మేనేజర్ వేధింపులు

జూబ్లీహిల్స్, ఏప్రిల్ 15, ప్రభాతవార్త: ఉద్యోగినిపై వేధింపులకు పాల్పడిన ఒక సంస్థ మేనేజర్‌పై పంజాగుట్ట ఠాణాలో కేసు నమోదైంది. పంజాగుట్ట పోలీసుల కథనం ప్రకారం.. అమీర్‌పేట ప్రాంతంలో ఉన్న ఒక కార్యాలయంలో ఒక యువతి(19) టెలీకాలర్‌గా పనిచేస్తుంది. అదే సంస్థలో మేనేజర్‌గా పనిచేస్తున్న తిరుపీధుల బాబురావు అలియాస్ చైనాబాబు ఈ నెల 11న ఆమెను ఇర్రుంమంజిల్‌లోని పీవీఆర్ థియేటర్‌లో డెకాయిట్ సినిమాకు తీసుకెళ్లాడు. అనంతరం కార్యాలయానికి వచ్చిన తరువాత ఆమె సెల్‌ఫోన్ లాక్కోవడమే కాకుండా గదిలో నిర్బంధించి బలవంతంగా ఆమెతో మద్యం తాగించాడు. అనంతరం ఆమెతో అనుచితంగా ప్రవర్తించాడు. అదే సమయంలో తన స్నేహితులు అక్కడికి రావడంతో వారి సాయంతో బయటపడింది. జరిగిన సంఘటనపై ఆమె పంజాగుట్ట పోలీసులకు పిర్యాదు చేయగా పోలీసులు తిరుపీధుల బాబురావుపై సెక్షన్ 75, 123, 126, 127 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

కొమురవెల్లి, ఏప్రిల్ 15,ప్రభాతవార్త : ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకొని మద్దతు ధరను పొందాలని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని గౌరాయిపల్లి కొమురవెల్లితో పాటు వివిధ గ్రామాల్లో బుధవారం ఆయన పర్యటించి ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, కొనుగోలు కేంద్రాలలో ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని అధికారులు, మిల్లుల యాజమాన్యంతో చర్చించి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అకాల వర్షాలపై రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. కొనుగోలు కేంద్రాలలో ధాన్యం అమ్మిన రైతులకు సకాలంలో డబ్బులు జమ అయ్యేల కృషి చేస్తానని తెలిపారు. మిల్లర్లు కొనుగోలు చేసిన ధాన్యంలో తేమ ఉందని తిరస్కరించడం సరికాదన్నారు. రైతులు ధాన్యాన్ని అరబెట్టి తేమ శాతం లేకుండా చూసుకోని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలన్నారు. కొనుగోలు కేంద్రాలలో విద్యుత్, తాగునీటి సౌకర్యం కల్పించాలన్నారు. ఆయన వెంట తహశీల్దార్, ఎంపిడివో, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ టీచర్లకు మొబైల్‌ఫోన్లు పంపిణీ...

చేర్యాల, ఏప్రిల్ 15 ప్రభాతవార్త : చేర్యాల మున్సిపల్ కార్యాలయంలో బుధవారం ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అంగన్‌వాడీ టీచర్లకు మొబైల్ ఫోన్లు, చిన్నపిల్లలకు అక్షరాభ్యాసం, దుస్తులు పంపిణీ చేశారు. అనంతరం అన్నప్రసన్న కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ముస్త్యాల అరుణ బాల్‌నర్సయ్య, వైస్ చైర్‌పర్సన్ మేడిశెట్టి ఉమాశ్రీధర్, కౌన్సిలర్లు పోతుగంటి ప్రసాద్, కొమ్ము రాజేశ్వరి నర్సింగరావు, షేరిఫాబేగం ఖాజా, వెలగల దుర్గయ్య, ఒగ్గు వెంకటమ్మ, సిడీపివో రమాదేవి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగమణి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ఐకెపి, పిఏసిఎస్ వద్ద కొనుగోలు కేంద్రాలు ప్రారంభం...

ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాజేశ్వర్‌రెడ్డి

చేర్యాల మండలంలోని ఆయా గ్రామాల్లోని ఐకేపి, పీఏసిఎస్ వద్ద కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ నల్లనాగుల శ్వేత, మార్కెట్ కార్యదర్శి రవికుమార్, చేర్యాల మాజీ ఎంపిపి ఉల్లంపల్లి కర్ణాకర్, మద్దూరు మాజీ ఎంపిపి బద్దిపడగ క్రిష్ణారెడ్డి, ముస్త్యాల బాల్‌నర్సయ్య, పూర్మ వెంకట్‌రెడ్డి, శివగారి అంజయ్య పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్న దృశ్యం

ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

ఎఎంసి వైస్ చైర్మన్ రాజశేఖర్

చిన్నకోడూరు, ఏప్రిల్ 15, ప్రభాతవార్త : రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకొని మద్దతు ధరను పొందాలని ఎఎంసి వైస్ చైర్మన్ బుస్సా రాజశేఖర్ సూచించారు. మండల పరిధిలోని పెద్దకోడూరులో బుధవారం ఐకెపి కొనుగోలు కేంద్రాన్ని సర్పంచ్ సామల సునీతమధుతో కలిసి ప్రారంభించి మాట్లాడారు. రైతులు ధాన్యాన్ని ఆరబెట్టి కొనుగోలు కేంద్రాలకు తేవాలన్నారు. కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయడం జరుగుతుందన్నారు. కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు వచ్చినా వెంటనే తెలియజేస్తే పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో ఎఎంసి డైరెక్టర్లు అనుపాటి విజయరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, పాషా,వార్డు సభ్యులు తుమ్మల తిరుపతి, మహేష్‌గౌడ్, వెలుగు సీసీ కొమురయ్య, మహిళ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

డా. శంకర్‌కు దళితరత్న అవార్డు

దళిత రత్న అవార్డు అందుకుంటున్న డా॥ శంకర్

కోహెడ,ఏప్రిల్ 15, ప్రభాతవార్త : మండల కేంద్రానికి చెందిన డాక్టర్ వెల్పుల శంకర్ సామాజిక కార్యకర్తగా దళిత హక్కులు, ఆత్మగౌరవం కోసం కొనసాగిస్తున్న పోరాటానికి గుర్తింపుగా దళితరత్న అవార్డు అందుకున్నారు. గత కొన్ని యేండ్లుగా డాక్టర్ శంకర్ బిసి, ఎస్సీ, ఎస్టీ,మైనార్టీల హక్కుల కోసం అలాగే పేదల సంక్షేమం కోసం నిరంతరం పోరాటం చేస్తున్నారు. ఆయన సేవలను కృషిని గుర్తించిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఈ అవార్డుతో సత్కరించింది. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ జయంతి ఉత్సవాల సందర్భంగా హైదారాబాద్‌లోని రవీంద్ర భారతితో నిర్వహించిన కార్యక్రమంలో డాక్టర్ వెల్పులు శంకర్ అవార్డును అందుకున్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, అంబేద్కర్ ఉత్సవాల కమిటీ, తెలంగాణ మాదిర దండోరా వ్యవస్థాపక అధ్యక్షులు ఇసుక రాజు, జున్ను కనకరాజు, ఇటుక గోపి, పొన్నాల బాబు, వెల్పుల కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్ట్ ఆరె శరత్‌కు దళిత రత్న అవార్డు

హుస్నాబాద్‌టౌన్, ఏప్రిల్ 15, ప్రభాతవార్త : హుస్నాబాద్‌కు చెందిన పాత్రికేయుడు ఆరె శరత్‌కు ఉత్తమ జర్నలిస్ట్ - దళితరత్న అవార్డు లభించింది. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన అంబేద్కర్ జయంతి ఉత్సవాల సందర్భంగా హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో జరిగిన కార్యక్రమంలో మంగళవారం రాత్రి ఈ అవార్డును ప్రదానం చేశారు. అంబేద్కర్ జయంతి ఉత్సవ కమిటీ చైర్మన్ అల్లిబిల్లి మహేందర్ చేతుల మీదుగా శరత్ ఈ అవార్డును స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జాతీయ మాలమహానాడు హుస్నాబాద్ నియోజకవర్గ ఇంచార్జి ఆరె కిశోర్‌తో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అవార్డు స్వీకరించిన అనంతరం హైదరాబాద్‌లోని మంత్రి క్వార్టర్స్‌లో పొన్నం ప్రభాకర్‌ను శరత్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ శరత్‌ను శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు.

'చిల్డ్రన్స్ రోడ్ సేఫ్టీ' విజయవంతం

మాట్లాడుతున్న హుస్నాబాద్ ఏసీపీ సదానందం

హుస్నాబాద్ రూరల్, ఏప్రిల్ 15, ప్రభాతవార్త : పట్టణంలోని సెయింట్ జోసెఫ్, మాంటిస్సోరి, సి.వి. రామన్ తదితర పాఠశాలల్లో హుస్నాబాద్ పోలీసుల ఆధ్వర్యంలో అరైవ్-అలైవ్ కార్యక్రమంలో భాగంగా చిల్డ్రన్స్ రోడ్ సేఫ్టీ అవగాహన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హుస్నాబాద్ ఏసీపీ సౌదారపు సదానందం హాజరై మాట్లాడుతూ విద్యార్థులు తమ భద్రతతో పాటు తల్లిదండ్రుల భద్రత పట్ల బాధ్యతగా వ్యవహరించాలన్నారు. విద్యార్థులకు ట్రాఫిక్ నియమాలు, హెల్మెట్ వినియోగం ప్రాముఖ్యతపై వివరించారు. అనంతరం విద్యార్థుల అవగాహనను పరీక్షించే విధంగా తల్లిదండ్రులపట్ల వారు తీసుకునే బాధ్యతలపై పరీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఐ కోంద్ర శ్రీనివాస్, ఎస్ఐ లక్ష్మారెడ్డి, ప్రధానోపాధ్యాయులు విజయ్‌కుమార్‌రెడ్డి, కాయిత నారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అక్కన్నపేటలో...

హుస్నాబాద్ ఏసీపీ సదానందం ప్రజలకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తూ, ప్రతి ఒక్కరు నియమాలను పాటించి సురక్షితంగా ప్రయాణించాలని సూచించారు. బుధవారం మండలంలోని గౌరవెల్లి గ్రామంలో సర్పంచ్ పాంద్రాల దాము ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలో అలైవ్ అరైవ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా సర్పంచ్ దాము విద్యార్థుల తల్లిదండ్రులకు 20 హెల్మెట్లు పంపిణీ చేశారు. అనంతరం విద్యార్థులు, తల్లిదండ్రులకు ట్రాఫిక్ నియమాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ సదానందం మాట్లాడుతూ మైనర్లకు ద్విచక్ర వాహనాలు, కార్లు ఇవ్వొద్దని స్పష్టం చేశారు. మొబైల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై చాతరాజు ప్రశాంత్, ఉప సర్పంచ్ మాచర్ల శ్రీనివాస్, వార్డు సభ్యులు రామస్వామి, అడ్వకేట్ మాచర్ల ఐలేష్, గ్రామ అధికారులు, పెద్దలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

వర్గల్, ఏప్రిల్ 15(ప్రభాతవార్త): మండలంలోని మహాత్మ జ్యోతిబాపూలే రెసిడెన్షియల్ మహిళా డిగ్రీ కళాశాలలో బుధవారం డైనమిక్ షోటోకాన్ కరాటే ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా వారు బెల్ట్స్ గ్రేడింగ్ టెస్టు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. మహిళలు కరాటే వంటి మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఏటిపి రజిత, డిడబ్ల్యూ జయలక్ష్మి, అకాడమిక్ కో-ఆర్డినేటర్ వరలక్ష్మి, స్పోర్ట్స్ ఇంచార్జ్ శాలిని, ఫిజికల్ డైరెక్టర్ ఎం.లోకేశ్వరి, మమత తదితరులు పాల్గొన్నారు.

కరాటే బెల్ట్స్ గ్రేడింగ్ టెస్టులో పాల్గొన్న విద్యార్థులు

విద్యార్థులకు నగదు పురస్కారం అందజేసి సత్కరిస్తున్న దృశ్యం

ర్యాంకులు సాధించిన విద్యార్థులకు నగదు పురస్కారం

గజ్వేల్ టౌన్, ఏప్రిల్ 15 (ప్రభాతవార్త): పట్టణంలో అంబేద్కర్ డెవలప్‌మెంట్ కమిటీ, జయంతోత్సవాల కమిటీ ఆధ్వర్యంలో ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులకు నగదు పురస్కారాలు అందజేయడంతో పాటు ఘనంగా సన్మానించారు. గజ్వేల్ మండలం అహ్మదీపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతిలో ప్రథమ ర్యాంకు సాధించిన గోవర్ధనగిరి, రెండవ ర్యాంకు సాధించిన కొడకండ్లకు చెందిన అఖిల, ఇంటర్‌లో ప్రథమ ర్యాంకు సాధించిన అడవిమసీద్‌కు చెందిన కె.మనోహర్, రెండో ర్యాంకు సాధించిన కప్పు భావన అనే విద్యార్థులకు గజ్వేల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాస్ నగదు బహుమతులను అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో గజ్వేల్ మండల ఎస్సీ సర్పంచ్‌లు లక్ష్మి కొండయ్య, మల్కగళ్ల కరుణాకర్, గిర్క కల్పన బాలస్వామి, మైసని కళ్యాణి ప్రశాంత్, కాసమోళ్ల శ్రీనివాస్, బ్యాగరి ప్రభాకర్, నాయకులు ఆటకూరి రాములు, మస్కూరి కిష్టయ్య, మన్నె కృష్ణ, పంబాల సత్యనారాయణ, మాచపురం బాల్‌నర్సయ్య, బొల్లారం ఎల్లయ్య, మైసని మల్లయ్య, దమ్మని మల్లయ్య, పొట్ట యాదగిరి, మైస స్వామి, నర్సింలు, బాలయ్య, ఎల్లయ్య, తుమ్మ శ్రీనివాస్, మైస రాములు, చిప్పల యాదగిరి, నీరుడి స్వామి, ఏలేశ్వరం మహేష్, మన్నె కృపానందం తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యాల సాధనకు కృషి చేయాలి

యువజన సంఘాల రాష్ట్ర అధ్యక్షుడు

సన్మాన కార్యక్రమం పాల్గొన్న విద్యార్థులు, నిర్వాహకులు

సంగారెడ్డి మున్సిపాలిటీ ఏప్రిల్ 15, ప్రభాతవార్త : ఉన్నత లక్ష్యాలను నిర్ణయించుకొని సాధనకు దృష్టిసారిస్తే లక్ష్యాలను సాధించవచ్చునని యువజన సంఘాల రాష్ట్ర అధ్యక్షుడు కూన వేణుగోపాలకృష్ణ అన్నారు బుధవారం సంగారెడ్డి లోని ఇష్ట జూనియర్ కళాశాలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సన్మాన కార్యక్రమం కు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు వినోద్ కుమార్, కార్తీక్ కోట, ప్రిన్సిపల్ డాక్టర్ డి.రవి కిరణ్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ షేక్ ఇబ్రహీం తో పాటు కళాశాల అధ్యాపక బృందం, సిబ్బంది, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అర్హులందరికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలి

కొడంగల్,ఏప్రిల్ 15(ప్రభాతవార్త): అర్హులందరికి ఇందిరమ్మ ఇల్లు మంజూరీ చేయాలని సీపిఐ కొడంగల్ ఇయోజకవర్గచ కార్యదర్శి ఎండీ.మహిముద్ డిమాండ్ చేశారు.బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించిన పార్టీ నియోజకవర్గ కౌన్సిల్ సమావేశంలో మాట్లాడారు.ప్రభుత్వం మంజూరీ చేసిన ఇందిరమ్మ ఇండ్లు అర్హులైన బీదవారికి కాకుండా ఆర్థికపరంగా ఉన్న వారికే మంజూరీ చేయడం తగదన్నారు.ఆర్థికంగా వెనుకబడిన బీదవారికి ఇల్లు లేని వారికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరీ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.అలాగే పార్టీలో ఓ వ్యక్తి తనకు తానే సీపిఐ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ అని పత్రికల్లో ప్రకటించుకోవడం సరైంది కాదని పార్టీ నాయకులు ముక్త కంఠంతో ఖండించారు.సమావేశంలో కోస్గీ,కొడంగల్,దౌల్తాబాద్, బొంరాస్‌పేట్, దుద్యాల మండలాల పార్టీ కార్యదర్శులు సీహెచ్. శ్రీనివాస్,సిరుసని శ్యాంసుందర్,ముతుల రాజు,లక్ష్మణ్,పార్టీ సీనియర్ నాయకులు ఇందనూర్ బషీర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల సభ

జిల్లెడు చౌదరిగూడ, ఏప్రిల్, 15,(ప్రభాతవార్త): జిల్లెడు చౌదరిగూడ మండల కేంద్రంలోని రైతు వేదికలో గురువారం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక మండల సభ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ ప్రవీణ్‌కుమార్ బుదవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి మండలంలోని అన్ని గ్రామాల సర్పంచ్‌లు, అన్ని శాఖల అధికారులు, అన్ని పార్టీల నాయకులు హాజరు కావాలని ఆయన సూచించారు. ఉదయం 10గంటలకు సభ ప్రారంభమవుతుందని ఆయన పేర్కొన్నారు.

రైలు నుంచి పడి వ్యక్తి మృతి

ఘట్‌కేసర్, ఏప్రిల్ 15, ప్రభాతవార్త: ప్రమాదవశాత్తు రైలు నుంచి కింద పడి ఓ గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందిన సంఘటన ఘట్‌కేసర్ రైల్వేస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది.బుధవారం ఉదయం 6:45 గంటల కంటే ముందు ఘట్‌కేసర్-బీబీనగర్ రైల్వేస్టేషన్ల కెఎంనెం:219/15-16 మధ్య గుర్తుతెలియని వ్యక్తి రైలు నుంచి జారి పడి మృతిచెందినట్లు సికింద్రాబాద్ జీఆర్‌పి పోలీసులకు సమాచారం అందింది.

ఈమేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించగా మృతుడు గుర్తుతెలియని వ్యక్తి కాగా 45 నుంచి 50 సంవత్సరాలు ఉంటాడని, తెలుపు రంగుపై నల్లటి చుక్కలు కల్గిన చొక్కా, బుడిద రంగు ప్యాంట్ ధరించి ఉన్నాడని, చామనుచాయ కోల ముఖం 5.3 ఎత్తు ఉండి గుండు ఉందని గుర్తు పట్టిన వారు జీఆర్‌పి సెల్‌నెంబర్లు: 9440083160/87126585 81కు సంప్రదించాలని తెలిపారు. ఈమేరకు మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు తెలిపారు.

బహుమతులు అందుకున్న విద్యార్థులు

విద్యార్థులకు రాష్ట్ర స్థాయి బహుమతులు

హుస్నాబాద్ టౌన్, ఏప్రిల్ 15, ప్రభాతవార్త : హుస్నాబాద్‌కు చెందిన సర్ సివి రామన్ ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాలలో విద్యార్థులు ఈ అభ్యాస్ అకాడమీ నిర్వహించిన ఐఐటీ నీట్ ఒలింపియాడ్ పరీక్షల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి బహుమతులు అందుకున్నారు. ఈ బహుమతులను హైదరాబాద్‌లోని భారతీయ విద్యా భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో అందజేశారు. ఈఅభ్యాస్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో మ్యాథమెటిక్స్, జనరల్ సైన్స్, బిజినెస్ ఆప్టిట్యూడ్, మెంటల్ ఎబిలిటీ వంటి అంశాలపై పరీక్షలు నిర్వహించగా, సర్ సి.వి. రామన్ పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ ర్యాంకులు సాధించారు. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఈఅభ్యాస్ అకాడమీ ఐఐటీ, నీట్ కార్యక్రమం ద్వారా నడపబడుతున్న సుమారు 300 పాఠశాలలలో హుస్నాబాద్‌లోని ఈ పాఠశాల ప్రథమ స్థానంలో నిలవడం విశేషంగా నిలిచింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు కాయిత నారాయణ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివితే ఇలాంటి విజయాలు సాధించవచ్చని పేర్కొంటూ బహుమతులు సాధించిన విద్యార్థులను అభినందించారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులలో ఉల్లి శ్రీ హర్షిణి, వేముల కార్తీక, మెరుగు సంక్షిప్, పోగుల సుహాస్ శౌర్య, గుండు అగస్త్య నందన్, అనంతోజు హిమాన్షిక, పెనుకుల వైనవి, పున్న అరూహి, పచ్చిమట్ల నందిని, బుర్ర శ్రీనిధి, ఠాకూర్ వర్షిత, కానవేని కార్తీక, కాసనగొట్టు తేజా శ్రీ, పోగుల రిత్విక్, సున్నం శృతిక, అనంతోజు శ్రీ చరిత్ తదితరులు ఉన్నారు. వీరు రాష్ట్రంలోని పలువురు ప్రముఖుల చేతుల మీదుగా బహుమతులు స్వీకరించారు.

హిందూ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలి

హిందూ సమ్మేళన కరపత్రాలను విడుదల చేస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

చిన్నశంకరంపేట, ఏప్రిల్ 15,ప్రభాతవార్త: పట్టణంలోని శ్రీసోమేశ్వరాలయం వద్ద ఈ నెల 19 నిర్వహించనున్న హిందూ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని ఉత్సవ కమిటి అధ్యక్షుడు డాక్టర్ రంగారావు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా కరపత్రాలను వారు విడుదల చేశారు. కార్యక్రమంలో కమిటి ఉపాధ్యక్షులు మల్లిఖార్జున్, డాక్టర్ సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి నీల శ్యామ్, కోశాధికారి బందారు శంకర్, వనం నర్సింలు, సభ్యులు భౌదిక్ ప్రముఖ్ లక్ష్మణ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

చెరువుల హద్దులు గుర్తింపునకు సర్వే

ఖాజాపూర్‌లో పటేల్ చెరువును పరిశీలిస్తున్న అధికారులు

చిన్నశంకరంపేట, ఏప్రిల్ 15,ప్రభాతవార్త: చెరువుల హద్దుల గుర్తింపునకు సర్వే చేపడుతున్నట్లు మండల తహసీల్దార్ మాలతి తెలిపారు. బుధవారం మండల పరిధి ఖాజాపూర్‌లో పటేల్ చెరువును తహసీల్దార్ మాలతి, ఇరిగేషన్, అటవి శాఖ అధికారులు కలిసి సంయుక్త సర్వే నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లను గుర్తించి హద్దులు గుర్తించేందుకు మండలంలో 30 చెరువులకు సర్వే నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఈ చెరువులకు జియో ట్యాగింగ్ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఎఈ వాసుదేవ్, అటవిశాఖ అధికారి, డిప్యూటీ సర్వేయర్ లక్ష్మీ భవానితదితరులు పాల్గొన్నారు.

ఇంటర్‌లో దీక్షితకు 3వ ర్యాంకు..సత్కారం

ఘట్‌కేసర్, ఏప్రిల్ 15, ప్రభాతవార్త: ఇంటర్ మీడియట్ పరీక్షా ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన దీక్షితను ఘట్‌కేసర్ మాజీ ఎంపిపి ఏనుగు సుదర్శన్‌రెడ్డి సన్మానించారు. ఘట్‌కేసర్ సర్కిల్ ఎదులాబాద్ డివిజన్ అవుషాపూర్‌కు చెందిన ద్యాగల సంతోష్ కూతురు దీక్షితఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో రాష్ట్ర స్థాయిలో 3వ ర్యాంకు (467/470) మార్కులు సాధించింది. ఈసందర్భంగా బుధవారం వారి నివాసానికి వెళ్లి సుదర్శన్‌రెడ్డి విద్యార్థిని దీక్షితను శాలువాతో సత్కరించి అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి ఉత్తమ ఫలితాలు పొందాలని ఆయన ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో నాయకులు ఏనుగు మచ్చేందర్‌రెడ్డి, కాసుల వెంకటేశ్‌గౌడ్, చిలుకమారి తదితరులు పాల్గొన్నారు.

19న ప్రవేశ పరీక్ష

కొండపాక, ఏప్రిల్ 15, ప్రభాతవార్త : మండల పరిధిలోని ఆదర్శ పాఠశాలలో 6వ తరగతి ప్రవేశాలకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఈనెల 19న ప్రవేశ పరీక్ష నిర్వహించడం జరుగుతుందని కొండపాక ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ బుధవారం తెలిపారు.ప్రవేశ పరీక్ష ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందన్నారు.అలాగే 7వ తరగతి నుంచి టెన్త్ వరకు ఖాళీ ఉన్న సీట్ల కోసం ఈనెల 19న 2 గంటల నుంచి 4 గంటల వరకు ప్రవేశ పరీక్ష నిర్వహించడం జరుగుతుందన్నారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు మోడల్ స్కూల్ వెబ్‌సైట్‌లో హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకొని పరీక్షా కేంద్రమైన కొండపాక ఆదర్శ పాఠశాలకు అర గంట ముందుగా చేరుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 9963360524 నంబరును సంప్రదించాలన్నారు.

పేద కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత

నంగునూర్, ఏప్రిల్ 15, ప్రభాతవార్త : మండల పరిధిలోని అంక్షాపూర్ గ్రామానికి చెందిన నర్మెట గంగవ్వ(75) అనారోగ్యంతో మంగళవారం రాత్రి మృతి చెందిన విషయం తెలుసుకున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావు స్థానిక నాయకుల ద్వారా రూ.5 వేల ఆర్థిక సహాయాన్ని పంపించారు. దీంతో బాధిత కుటుంబీకులకు రూ.5 వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. కార్యక్రమంలో బుచ్చి వీరయ్య, నరోత్తంరెడ్డి, ఉపసర్పర్ మల్లయ్య, పురుషోత్తంరెడ్డి, రమేష్, లక్ష్మణ్,శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికుల సమ్మెను విజయవంతం చేయాలి

బిసి వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి రవీందర్‌గౌడ్

సిద్దిపేట అర్బన్, ఏప్రిల్ 15, ప్రభాతవార్త : తెలంగాణ ఆర్టీసి కార్మికులను ప్రభుత్వంలో విలీనం చేయాలని పెండింగ్‌లో ఉన్న రెండు పే స్కేల్ ఇవ్వాలని లేనియెడల టిజి ఆర్టీసి రాష్ట్ర జెఎసి పిలుపు మేరకు ఈ నెల 22న ఫస్టుషిఫ్ట్ నుంచి అన్ని బస్సులను ఎక్కడివి అక్కడే ఆపాలని సమ్మెకు పిలుపునిచ్చిందని పిలుపుకు సిద్దిపేట డిపో ఆర్టీసి బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ పూర్తి మద్దతునిస్తున్నట్లు రాష్ట్ర బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి రవీందర్‌గౌడ్ బుధవారం తెలిపారు. రాష్ట్ర జెఎసి ఇచ్చిన పిలుపులో భాగంగా ఈనెల 22న చేపట్టే సమ్మెలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో డిపో బీసీ సంక్షేమ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు రాజేందర్, బిఎస్‌గౌడ్, ఎన్.పర్శరాములుగౌడ్, ఎన్.సతీష్, ఎస్.అశోక్‌లు పాల్గొన్నారు.

పోలీసులకు బారికేడ్లు అందజేత

హుస్నాబాద్ రూరల్, ఏప్రిల్ 15, ప్రభాతవార్త : పట్టణంలోని హుస్నాబాద్ ఫార్మసీ ప్రారంభించి సంవత్సరం పూర్తిచేసుకున్న సందర్భంగా ఫార్మసీ యాజమాన్యం బుధవారం సామాజిక బాధ్యతగా హుస్నాబాద్ పోలీసులకు 15 చెక్‌పోస్ట్ బారికేడ్లు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బారికేడ్లను పోలీసులకు అందజేశారు. ఈ సేవను అభినందించిన హుస్నాబాద్ ఏసిపి సౌదారపు సదానందం మెడికల్ ఫార్మసీ యాజమాన్యాన్ని శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో హుస్నాబాద్ సీఐ కోంద్ర శ్రీనివాస్, ఎస్సై పాకాల లక్ష్మారెడ్డితో పాటు ఫార్మసీ యజమానులు ఆంజనేయులు గౌడ్, వేణు, తిరుపతి, మహేంద్ర, నరేష్ తదితరులు ఉన్నారు.

ఉపాధ్యాయుని కుటుంబానికి రూ.లక్ష చెక్కు అందజేత

ఉపాధ్యాయుని సతీమణికి చెక్కు అందజేస్తున్న వంగ మహేందర్‌రెడ్డి

మర్కుక్, ఏప్రిల్ 15 (ప్రభాతవార్త): మండల పరిధిలోని చేబర్తి గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణిత శాస్త్ర ఉపాధ్యాయునిగా విధులు నిర్వహించిన ఎం.వి.రమాకాంతారావు గత నెలలో మరణించారు. ఉపాధ్యాయుడు రమాకాంతారావు పిఆర్‌టియు సంఘంలో క్రియాశీలక సభ్యత్వం కలిగి వుండగా వారి సతీమణి రమకు బుధవారం పిఆర్‌టియు సంక్షేమ సంస్థ నిధి నుండి లక్ష రూపాయల చెక్కును పిఆర్‌టియు రాష్ట్ర అధికార ప్రతినిధి వంగ మహేందర్‌రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా వంగ మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయుడు రమాకాంతారావు మరణం చాలా బాధాకరమని, పిఆర్‌టియు సంఘం ద్వారా వారి కుటుంబానికి సహాయం చేయడం ముఖ్య ఉద్దేశం అని అన్నారు. వారి యొక్క కుటుంబ పెన్షన్ తదితర విషయాలన్నింటిలో పిఆర్‌టియు మర్కుక్ మండల శాఖ సహాయపడుతుందని తెలిపారు. పిఆర్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆదరాసుపల్లి శశిధర్‌శర్మ మాట్లాడుతూ సిద్దిపేట జిల్లాలో దురదృష్టవశాత్తు ఈ విద్యాసంవత్సరంలో 8 మంది పిఆర్‌టియు ఉపాధ్యాయులు అనారోగ్య కారణాలవల్ల మరణించారని, వారందరికి పిఆర్‌టియు సంక్షేమ సంస్థ ద్వారా లక్ష రూపాయలు పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పిఆర్‌టియు మర్కుక్ మండల అధ్యక్షులు రేబల్లి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి తుమ్మ కుమార్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు షాబుద్దీన్, సీనియర్ నాయకుడు వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కౌన్సిలర్లకు సన్మానం

కౌన్సిలర్లను సన్మానిస్తున్న అంబేద్కర్ సంఘం నాయకులు

గజ్వేల్ టౌన్, ఏప్రిల్ 15 (ప్రభాతవార్త): గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో ఇటీవల గెలుపొందిన కౌన్సిలర్లు కప్ప మమత పోచయ్య, బాబులను అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించి మెమెంటోలను అందజేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్లు మాట్లాడుతూ అంబేద్కర్ జయంతి రోజున మాకు ఈ సత్కారం జరగడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ

గజ్వేల్ టౌన్, ఏప్రిల్ 15 (ప్రభాతవార్త): పట్టణంలోని ఇందిరాపార్కు వద్ద ఆర్యవైశ్యులు ఏర్పాటు చేసిన చలివేంద్రం వద్ద బుధవారం మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల దాహార్తిని తీర్చడానికి ఏడు సంవత్సరాలుగా చలివేంద్రం ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఈ మజ్జిగ పంపిణీ కార్యక్రమానికి ఎలిశాల కాశీనాథ్ సహకరించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య నాయకులు సిద్ధి బిక్షపతి, తోట బిక్షపతి, ఉప్పల కృష్ణమూర్తి, దూబకుంట రుక్మయ్య, లచ్చులు, అంతునూరి శివకుమార్, లక్ష్మణ్, గౌరిశెట్టి శ్రీనివాస్, గంగా రమేష్, సముద్రాల అమర్నాథ్, మర్యాల లింగం, శ్రీనివాస్, జగ్గయ్యగారి రాజు, మరుమాముల ఓంకార్ తదితరులు పాల్గొన్నారు.

వంద శాతం ఫలితాలు సాధించిన నవోదయ విద్యాలయం

వర్గల్, ఏప్రిల్ 15 (ప్రభాతవార్త):

2025-26 విద్యా సంవత్సరానికి సిబిఎస్సీ బోర్డ్ వారు నిర్వహించిన పదవ తరగతి వార్షిక బోర్డు పరీక్షల్లో వర్గల్ జవహర్ నవోదయ విద్యాలయం వంద శాతం ఫలితాలను సాధించిందని విద్యాలయ ప్రిన్సిపల్ దాసి రాజేందర్ తెలిపారు. ఈ సంవత్సరం ఫిబ్రవరి, మార్చి నెలలో జరిగిన బోర్డు పరీక్షల ఫలితాలు సిబిఎస్‌సి వారు బుధవారం విడుదల చేయడం జరిగిందన్నారు. విద్యాలయంలో మొత్తం 77 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా అందరూ ఉత్తీర్ణులైనట్లు తెలిపారు. ఇందులో విద్యార్థిని సాయిలహరి 479 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలువగా, ధరణి తరుణ్, గొల్ల భానులు 476 మార్కులు సాధించి ద్వితీయ స్థానంలో నిలువగా, 473 మార్కులు సాధించిన జయప్రకాష్ బెహరా తృతీయ స్థానంలో నిలిచినట్లు తెలిపారు.

బోరంచ పోచమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

బోరంచ జాతర ఉత్సవాలకు ఏర్పాట్లు చేయండి

ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి

మనూర్, ఏప్రిల్ 15, ప్రభాతవార్త: మండల పరిధిలోని బోరంచ గ్రామంలో గల నల్లపోచమ్మ అమ్మవారి జాతర ఉత్సవాలు ఈ నెల 23వ తేదీ నుంచి ప్రారంభం అవుతున్నందున ఆయా శాఖల అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. బుధవారం ఎమ్మెల్యే సంజీవరెడ్డి నల్లపోచమ్మ ఆలయానికి చేరుకోగా ఈఓ శివరుద్రప్ప, ప్రధాన అర్చకులు శ్రీకాంత్‌స్వామి, అర్చకులు నగేష్‌స్వామి, సిద్దుస్వామి పూర్ణకుంభంతో స్వాగతంపలికి వేదమంత్రాలు వల్లిస్తూ ప్రత్యేక పూజలు నిర్వహించచేశారు. ఎమ్మెల్యేకు శాలువాతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందచేసి ఆశీర్వచనాలు చేశారు. ఈసందర్భంగా ఆయా శాఖల అధికారులతో ఎమ్మెల్యే జాతర ఉత్సవాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 7 వారాలపాటు సాగే జాతర ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కాకాకుండా చూడాల న్నారు. కార్యక్రమంలో ఎంపిడిఓ చంద్రశేఖర్, తహసీల్దార్ విష్ణుసాగర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రాము, ఆలయ కమిటీ చైర్మన్ మల్లయ్య, సర్పంచ్ బీరప్ప, నాయకులు బ్రహ్మానందరెడ్డి, సంజీవరెడ్డి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

సీమ ఆంజనేయ ఆలయంలో ముగిసిన సప్తహా



సప్తహలో పాల్గొన్న శ్రీకరణ్ గజేంద్ర భారతి మహారాజ్

సిర్గాపూర్, ఏప్రిల్ 15, ప్రభాతవార్త: మండల పరిధిలోని పంచముఖి గ్రామ శివారులోగలసీమ హనుమాన్ ఆలయ తృతీయ వార్షికోత్సవాలను పురస్కరించుకుని ఆలయంలో నిర్వహించిన హరినామ సప్తహా కార్యక్రమాలు వైభవంగా ముగిసాయి. బుధవారం కరణ్ గజేంద్ర భారతిమహారాజ్ సూచనల మేరకు శ్రీహరి భక్త పారాయణ్ అవదూత్ మహారాజ్‌చే గాథ పూజా కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. తుకారం మహారాజ్ రచించిన అభంగాలతో భజన కార్యక్రమం భక్తులు ఆడుతూ పాడుతూ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పూజా కార్యక్రమాలకు మండల ప్రజలతో పాటు నియోజకవర్గంలోని ఆయా గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆలయంలో పూజా కార్యక్రమాలు నిర్వహించి మహారాజ్‌ల ఆశీర్వచనాలు అందుకున్నారు. కార్యక్రమంలో ఆనంద్ మహారాజ్, ఏకంబ అవధూత్ దేవస్థానం ధార్మిక అధ్యాత్మిక సేవ సదన్ ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు. ఇదిలాఉండగా ఈనెల 16న ఉదయం 10 గంటలకు కాలా కీర్తన సేవా కార్యక్రమం శ్రీ కరణ్ గజేంద్ర మహారాజ్‌చే నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ సభ్యులు సంజీవులు తెలిపారు. కాలా కీర్తన సేవా కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో చేరుకుని తీర్ధ ప్రసాదాలు అందుకుని స్వామి వారి కృపకు పత్రులు కావాలని సంజీవులు సూచించారు.

సురక్షిత డ్రైవింగ్‌తో ప్రమాదాలకు దూరం : సిఐ

రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తున్న సిఐ శివలింగం

మొగుడంపల్లి, ఏప్రిల్ 15, ప్రభాతవార్త: ప్రతి ఒక్క వాహన చోదకుడు రోడ్డు భద్రతను పాటిస్తూ ఏకాగ్రతతో వాహనాన్ని నిడిపితే రోడ్డు ప్రమాదాలకు దూరంగా ఉంటారని, గమ్యస్థానాలకు సురక్షితంగా చేరుకుంటారని జహీరాబాద్ పట్టణ సిఐ శివలింగం అన్నారు. బుధవారం మొగుడంపల్లిలోని ట్రైబల్ వెల్ఫేర్ కళాశాలలో చిరాగ్‌పల్లి ఎస్ఐ రాజేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమానికి సిఐ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ విద్యార్థులకు ట్రాఫిక్ నియమాలపై వివరించారు. ఐఎస్ఐ మార్కు గల హెల్మెట్ ధరించడం ప్రాణరక్షణకు ముఖ్యమన్నారు. తండ్రికి లేఖ ద్వార సురక్షిత డ్రైవింగ్‌పై సందేశం పంపాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో రోడ్డు భద్రతపై ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గొల్ల దేవయ్యను పరామర్శించిన ఎమ్మెల్యే

మొగుడంపల్లి, ఏప్రిల్ 15, ప్రభాతవార్త: మండల పరిధిలోని ఇప్పేపల్లి గ్రామానికి చెందిన గొల్ల దేవయ్య అనారోగ్యంతో అవస్థలు పడి ఆసుపత్రిలో చికిత్స అందుకుని ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నట్లు తెలుసుకున్న ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు బుధవారం దేవయ్య నివాసానికి చేరుకుని ఆరోగ్య పరిస్థితిని అడిగితెలుసుకున్నారు. అధైర్యపడవద్దని, అండగా ఉంటానని ఎమ్మెల్యే దేవయ్యకు భరోసా కల్పించారు. ఎమ్మెల్యే వెంట మండల బిఆర్ఎస్ అధ్యక్షులు సంజీవ్‌రెడ్డి, గ్రామ సర్పంచ్ కవిత నాగ్‌శెట్టి, సురేష్, ఈశ్వర్‌రెడ్డి, బస్వరాజ్, రాములు, వెంకట్, కృప తదితరులు ఉన్నారు.

విద్యతోనే జీవితానికి ఉజ్వల భవిష్యత్తు

జహీరాబాద్, ఏప్రిల్ 15, ప్రభాతవార్త: విద్యతోనే జీవితానికి ఉజ్వల భవిష్యత్తు కల్గుతుందని మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ ప్రొఫెసర్ ముస్తఫాఅలీ సర్వారి అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం యాన్యువల్ స్పోర్ట్స్ డే సమావేశంకు ప్రొఫెసర్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. విద్యార్థులు, ఇంటర్మీడియట్, డిగ్రీ స్థాయిలో కష్టపడి నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించుకుంటే భవిష్యత్తు బంగారు మయం కావడం తధ్యమని గుర్తు చేశారు. విద్యార్థుల క్రమ శిక్షణతో పోషకులు, ఉపాధ్యాయుల, పెద్దల సూచనలు పాటిస్తూ ముందుకు సాగాలన్నారు. స్పోర్ట్ డే సందర్భంగా నిర్వహించిన ఆటల పోటీలలో విజయం సాధించిన విద్యార్థులకు, పరీక్షల్లో కళాశాల టాపర్లుగా నిలిచిన విద్యార్థులకుఉ బహుమతులు అందచేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ అస్లం ఫారుకి, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశం, మైనార్టీ నాయకులు అయూబ్, సైఫుద్దీన్ గౌరీ, అధ్యాపకులు సురేందర్‌రెడ్డి, అయేషా బేగం, విద్యార్థులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ ముస్తఫా అలీ సర్వారి

అంగన్‌వాడీ కేంద్రాల్లో సోలార్ విద్యుత్ ప్లేట్లను ఏర్పాటు చేయాలి

మెదక్ ఎంపి రఘునందన్ రావు

చిన్నారులకు సర్టిఫికెట్‌లు అందజేస్తున్న ఎంపి, ఎమ్మెల్యే తదితరులు

నర్సాపూర్, ఏప్రిల్ 15, ప్రభాతవార్త : ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో సోలార్ విద్యుత్ ప్లేట్లను అమర్చుకొని వాడుకునే విధంగా టీచర్లు అడుగులు వేయాలని మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్‌రావు అన్నారు. బుధవారం నర్సాపూర్ లోని సాయికృష్ణ గార్డెన్‌లో ఐసిడిఎస్ నర్సాపూర్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో అంగన్‌వాడీ చిన్నారులకు గ్రాడ్యుయేషన్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మెదక్ ఎంపీ రఘునందన్‌రావు, ఎమ్మెల్యే సునీతరెడ్డి, జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మీరాజుయాదవ్ హాజరయ్యారు. ఈ కార్యక్రమం ఇంచార్జ్ డిడబ్ల్యూఓ హేమ భార్గవి జ్యోతి ప్రజ్వళన చేశారు. అనంతరం చిన్నారులకు అతిథుల చేతులమీదుగా గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా మెదక్ ఎంపీ రఘునందన్ రావు మాట్లాడుతూ ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో సోలార్ విద్యుత్ ప్లేట్స్ అమర్చి విద్యుత్ వాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అంతేగాక సోలార్ విద్యుత్‌తో ఇండక్షన్ స్టవ్‌లను వాడుకుంటే గ్యాస్ సమస్య ఉండదని పేర్కొన్నారు. ఎమ్మెల్యే సునీతరెడ్డి మాట్లాడుతూ, ప్రస్తుతం మహిళల్లో రక్తహీనత ఎక్కువగా ఉందని, దీనిని తగ్గించేందుకు అంగన్‌వాడీ టీచర్‌లు ఆకుకూరలపై, పుష్టికరమైన సమతుల ఆహారంపై అవగాహన కల్పించాలన్నారు. ఐసిడిఎస్ ఆధ్వర్యంలో ఇలాంటి చిన్నారుల గ్రాడ్యుయేషన్ వేడుకలను ఘనంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మీరాజుయాదవ్ మాట్లాడుతూ నర్సాపూర్‌లో 13 అంగన్‌వాడీ కేంద్రాలకు పక్కా భవనాలు లేవన్నారు. ఎంపీ రఘునందన్‌రావు పక్కా భవనాల నిర్మాణాలకు నిధులు మంజూరు చేయాలని కోరారు. ఇందుకు స్పందించిన ఎంపీ రఘునందన్‌రావు తన ఎంపీ నిధులనుండి మూడు అంగన్‌వాడీ భవన నిర్మాణాలకు నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం పదవీ విరమణ పొందుతున్న అంగన్‌వాడీ టీచర్లకు, ఆయాలను సన్మానించారు. కార్యక్రమంలో చిన్నారులు పాటలపై డ్యాన్సులు చేసి అందరినీ అలరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ బుచ్చేష్‌యాదవ్, కౌన్సిలర్ బుల్లెట్ రాజు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు శివకుమారి, సంతోషమాత, మెహతాబేగం, నర్సాపూర్ ప్రాజెక్ట్ పరిధిలోని సూపర్‌వైజర్‌లు సరళకుమారి, కవిత, వసుమతి, నర్సమ్మ, సంతోష, కమర్ సుజాత, కౌన్సిలర్లు, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న బిడిఎల్ భానుర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎల్.కిషన్

అగ్నిమాపక సేవా దినోత్సవ వేడుకలు

పటాన్‌చెరు, ఏప్రిల్ 15, ప్రభాతవార్త : బిడిఎల్ భానుర్ సిఐఎస్‌ఎఫ్ యూనిట్‌లో బుధవారం జాతీయ అగ్నిమాపక సేవా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బిడిఎల్ భానుర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎల్.కిషన్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. అసిస్టెంట్ కమాండెంట్, ఫైర్ అర్షద్ అలీ ఖాన్ ముఖ్య అతిథికి హాజరైన ఇతర ప్రముఖులకు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో 1944సంవత్సరంలో బాంబే డాక్‌యార్డ్‌లో, ఆ తర్వాతి సంవత్సరాలలో జరిగిన అగ్నిప్రమాదాలలో మరణించిన అగ్నిమాపక సిబ్బందికి షహీద్ స్మారక్ వద్ద పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో 14 ఏప్రిల్ 2026 నుండి 14 ఏప్రిల్ 2026 వరకు గల అగ్నిమాపక నివేదికను యూనిట్ కమాండర్ డిప్యూటీ కమాండెంట్ సి.శ్రీరామ్ తేజస్వి సమర్పించారు. బిడిఎల్ భానుర్ సిఐఎస్‌ఎఫ్ యూనిట్ ఫైర్ వింగ్, నేడు ప్రారంభించబడుతున్న అగ్నిమాపక సేవా వారోత్సవాలను నిర్వహిస్తోంది. ఈ సందర్భంగా బిడిఎల్ భానుర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎల్.కిషన్ మాట్లాడుతూ.. ప్లాంట్ ఉద్యోగులు, సాధారణ పౌరులు, ఇతరులకు అగ్ని భద్రతపై అవగాహన కల్పించడమే అగ్నిమాపక సేవా వారోత్సవాల ముఖ్య ఉద్దేశమన్నారు.

పాఠశాలలో రోడ్డు భద్రతా అవగాహన సదస్సు

చిలిపిచెడ్, ఏప్రిల్ 15 ప్రభాతవార్త : జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సోమక్కపేటలో బుధవారం విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మండల విద్యాధికారి విఠ్టల్, సర్పంచ్ దుర్గాచలం విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రస్తుత రోజుల్లో రోడ్డు ప్రమాదాలు పెరిగిపోతున్నాయని, ముఖ్యంగా యువత నిర్లక్ష్యం వల్ల అనేక కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులు చిన్నతనం నుంచే ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. తల్లిదండ్రులతో ప్రయాణించేటప్పుడు వారు హెల్మెట్ లేదా సీట్ బెల్ట్ ధరించేలా విద్యార్థులు ప్రోత్సహించాలని, డ్రైవింగ్ చేసేటప్పుడు ఫోన్ మాట్లాడటం ప్రాణాంతకమని గుర్తించాలని మండల విద్యాధికారి స్థానిక సర్పంచ్ శిరస్త్రాణం అందజేశారు. అనంతరం విద్యార్థులందరూ "మేము ట్రాఫిక్ నిబంధనలను తప్పక పాటిస్తాము అని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

హాస్పిటల్ అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే

నారాయణఖేడ్, ఏప్రిల్ 15 ప్రభాతవార్త : నారాయణఖేడ్ మున్సిపల్ పరిధిలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో హాస్పిటల్ డెవలప్‌మెంట్ సొసైటీ సమావేశం ఘనంగా జరిగింది. సమావేశంలో ఎమ్మెల్యే డాక్టర్ సంజీవ్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ నాగేష్‌శెట్కార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఆసుపత్రిలో అవసరమైన సదుపాయాలు, వైద్య పరికరాలు, సిబ్బంది సమస్యలపై చర్చించారు. రోగులకు నాణ్యమైన చికిత్స అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రులను బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తాహిర్ అలీ, మున్సిపల్ కౌన్సిలర్ వివేకానంద మహేందర్, లక్ష్మణ్, మహేష్, షారుఖ్, సూపరిండెంట్ రమేష్ వైద్యులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

దళారులను నమ్మి రైతులు మోసపోవద్దు

వెల్దుర్తి, ఏప్రిల్ 15, ప్రభాతవార్త : మండల వ్యవసాయ రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించి ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సర్పంచ్ ఆదర్శ్, చైతన్య హనుమంత్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రమైన వెల్దుర్తితోపాటు బండ పోచంపల్లి. శెట్టిపల్లి, విధులపల్లి, పిఎస్ఎస్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. రైతులు ఆరుకాలం కష్టించి పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోని విక్రయించాలన్నారు. దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. క్వింటాలికి రూ. 2389 చెల్లిస్తుందన్నారు. పిఎస్ఎస్ సీఈఓ అశోక్, మండల వ్యవసాయ విస్తరణ అధికారి మసీద్ అలీ, పిఏసిఎస్ డైరెక్టర్ కృష్ణగౌడ్, మాజీ ఎంపిటిసి అశోక్‌గౌడ్ పాల్గొన్నారు.

సురక్షిత ప్రయాణాన్ని ప్రోత్సహించడమే లక్ష్యం : ఎస్ఐ

చిన్నశంకరంపేటలో మానవహారం నిర్మిస్తున్న దృశ్యం

చిన్నశంకరంపేట, ఏప్రిల్ 15,ప్రభాతవార్త: రోడ్డు ప్రమాదాలను తగ్గించి సురక్షిత ప్రయాణాలను ప్రోత్సహించాలనే లక్ష్యంతో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అరైవ్-అలైవ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ నారాయణగౌడ్ తెలిపారు. బుధవారం ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక అరైవ్-అలైవ్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ఎస్ఐ మాట్లాడుతూ రోడ్డు భద్రత అందరి బాధ్యత అని, ద్విచక్రవాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్ వాడాలని, రోడ్డు భద్రతా నిబంధనలు పాటించకపోతే ప్రాణనష్టం, ఆర్థికనష్టం కుటుంబాలపై పడె దష్పరిణామాల గురించి వివరించారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని తెలిపారు. అనంతరం మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్స్ అందజేత

కొల్చారం ఏప్రిల్ 15 ప్రభాతవార్త : కొల్చారం మండల కేంద్రమైన కొల్చారం గ్రామంలోని మండల ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి చేతుల మీదుగా మండల పరిధిలోని ఎనగండ్ల, రంగంపేట, సంగాయిపేట, వరిగుంతం, పైతర, కోనాపూర్, తుక్కాపూర్, చిన్నగనాపూర్, వెంకటాపూర్, అంసాన్‌పల్లి, పోతిరెడ్డిపల్లి, కొంగోడు, పోతంశెట్టిపల్లి, కిష్టాపూర్ గ్రామాలకు చెందిన మొత్తం 55 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల ప్రొసీడింగ్స్ అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదలకు సొంత ఇంటి కల నెరవేర్చడం ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా ఇళ్లు అందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రఫీకున్నిసా, ఆయా గ్రామాల సర్పంచులు, ప్రజా ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

పేదల సొంత ఇంటి కలను నిజం చేయడమే లక్ష్యం :ఎమ్మెల్యే

నారాయణఖేడ్, ఏప్రిల్ 15 ప్రభాతవార్త : మండలంలోని హంగీరగా (కె) గ్రామంలో బుధవారం అవుటి భవాని (భర్త అంబదాస్) నిర్మించుకున్న నూతన ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ వేడుకలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మున్సిపల్ చైర్మన్ నాగేష్ శెట్కార్ నూతన గృహంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, లబ్ధిదారురాలు కుటుంబానికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల సొంతింటి కలను నిజం చేయడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అని, అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందేలా కృషి కొనసాగుతుంది అని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ వివేకానంద మహేందర్, లక్ష్మణ్, పాండు, గ్రామ సర్పంచ్ శాంత్ కుమార్, ఉపసర్పంచ్ భాస్కర్, మాజీ సర్పంచ్‌లు పండరి, మనోహర్ మరియు గ్రామ పెద్దలు, గ్రామస్తులు భారీగా హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

ప్రభుత్వ పెన్షనర్ల సంక్షేమానికి కృషి చేస్తా

ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

ప్రభుత్వ పెన్షనర్‌ల విహార యాత్రను జండా ఊపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

రామచంద్రాపురం, ఏప్రిల్ 15, ప్రభాతవార్త: పటాన్‌చెరు నియోజకవర్గంలోని ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల(పెన్షనర్ల) సంక్షేమానికి తనవంతు సంపూర్ణ సహకారం అందిస్తూ వారి సంక్షేమానికి కట్టుబడి ఉన్నానని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. రామచంద్రపురం ప్రభుత్వ పెన్షనర్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పెన్షనర్లు కాశీ, అయోధ్య, ఢిల్లీలకు నిర్వహిస్తున్న విహార యాత్రను బుధవారం ఎమ్మెల్యే జండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పెన్షనర్ల విహార యాత్రకు తనవంతుగా 15 లక్షల రూపాయలను అందేశామన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి పెన్షనర్లు తమ సూచనలు, సలహాలు అందచేయాల్సిన అవసరం ఉందన్నారు. పెన్షనర్లకు సొంత భవనం సైతం నిర్మించి ఇచ్చినట్లు గుర్తు చేశారు. తమ సంక్షేమానికి కృషిచేస్తున్న ఎమ్మెల్యేకు అండగా ఉంటామని పెన్షనర్లు అన్నారు. విహారయాత్రకు ఆర్థిక సహాయం చేసిన ఎమ్మెల్యేకు పెన్షనర్లు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రామచంద్రాపురం మాజీ కార్పొరేటర్ తొంట అంజయ్య, నాయకులు గూడెం మధుసూదన్‌రెడ్డి, పరమేష్‌యాదవ్, ఐలేష్, ప్రమోద్‌గౌడ్, పెన్షనర్ల సంఘం ప్రతినిధులు రామిరెడ్డి, రాములు, నాగభూషణం ఉన్నారు.

కార్యకర్తకు ఆర్థిక సహాయం అందజేత...

రామచంద్రాపురం, ఏప్రిల్ 15, ప్రభాతవార్త: తననే నమ్ముకున్న కార్యకర్త కోసం ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి బాసటగా నిలిచి నాయకత్వ లక్షణాలు చాటుకున్నారు. రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని ఎస్ఎన్ కాలనీకి చెందిన యూసుబ్ దశాబ్దాలుగా ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డికి అనుచరుడిగా కొనసాగుతూ వస్తున్నాడు. ఇటీవల యూసుబ్ క్యాన్సర్ వ్యాధికి గురైనట్లు తెలుసుకున్న ఎమ్మెల్యే యూసుబ్ నివాసానికి చేరుకుని యూసుబ్‌ను పరామర్శించి తానున్నానని, అధైర్యపడాల్సిన పనిలేదని భరోసా కల్పించడమే కాకుండా అప్పటికి అప్పుడు లక్షరూపాయలను అందచేశారు. యూసుబ్ గత 35 ఏండ్లుగా తన కష్ట సుఖాల్లో, గెలుపు ఓటముల్లో తమ కుటుంబానికి అండగా నిలిచారని గుర్తు చేసుకున్నారు. తనను నమ్ముకున్న ప్రతి కార్యకర్త కష్ట సుఖాల్లో పాలుపంచుకుంటానని ఎమ్మెల్యే తెలిపారు.

నేడు ప్రజా పాలన ప్రగతి ప్రణాళికపై సమావేశం

-ఎంపిడిఓ చంద్రశేఖర్

మనూర్, ఏప్రిల్ 15, ప్రభాతవార్త: ఈ నెల 16న మనూర్‌లోని రైతు వేదికలో ఉదయం 10 గంటలకు ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికపై కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మండల అభివృద్ధి అధికారి చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ఆయాగ్రామాల సర్పంచ్‌లు, ఉప సర్పంచ్, పంచాయతీ కార్యదర్శులు, మండల స్థాయి అధికారులు హాజరు కావాలని కోరారు. ప్రజాపాలన పథకాలపై సామావేశంలో చర్చించడం జరుగుతుందని, అధికారులు తమ శాఖలకు సంబంధించిన పూర్తి నివేదికలతో కార్యక్రమానికి హాజరు కావాలని ఎంపిడిఓ చంద్రశేఖర్ సూచించారు.

సిర్గాపూర్ రైతువేదికలో...

సిర్గాపూర్, ఏప్రిల్ 15, ప్రభాతవార్త: ఈ నెల 16న సిర్గాపూర్‌లోని రైతు వేదికలో ఉదయం 11 గంటలకు ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికపై కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మండల అభివృద్ధి అధికారి ఒక ప్రకటలో తెలిపారు. కార్యక్రమానికి ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఉపసర్పంచ్, పంచాయతీ కార్యదర్శులు, మండలస్థాయి అధికారులు హాజరు కావాలని కోరారు. ఆయాశాఖల ద్వార సాధించిన విజయాలపై చర్చిండం జరుగుతుందన్నారు. ప్రభుత్వ పథకాలు అందుకుంటున్న లబ్దిదారుల పేర్లను చదవడం జరుగుతుందన్నారు. ప్రజా ప్రతినిధుల సందేశం ఉంటుందన్నారు. గుర్తించిన సమస్యలు, వాటి పరిష్కారాలపై చర్చిస్తామన్నారు.

వృద్ధురాలికి వంట సరుకులు అందజేత

సిర్గాపూర్, ఏప్రిల్ 15, ప్రభాతవార్త: మండల పరిధిలోని జమ్లా తండా పంచాయతీ పరిధిలోని జీవుల తండాకు చెందిన వృద్ధురాలు శివులిబాయికి గుర్రపు మచ్చేందరర్ ఫౌండేషన్ నాయకులు బుధవారం నిత్యావసర సరుకులు అందచేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ నాయకులు మాట్లాడుతూ కుటుంబ పోషణ భారంగా ఉన్న వారికి జిఎంఆర్ ఫౌండేషన్ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో బసిరెడ్డి, నరేష్, రాములు, పరశురాం, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యలు తీర్చాలని ఎమ్మెల్యేకు వినతి

మొగుడంపల్లి, ఏప్రిల్ 15, ప్రభాతవార్త: మండల కేంద్రంలో తాండవిస్తున్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావుకు బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు సంజీవరెడ్డి బుధవారం వినతి చేశారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు సంజీవరెడ్డి మాట్లాడుతూ మిషన్‌భగీరథ నీరు సక్రమంగా సరాఫరా కాక గ్రామస్థులు బోర్లపై ఆధారపడుతున్నారన్నారు. నీటి సరఫరాను మెరుగుపర్చేందుకు కొత్త బోర్లు వేయాలని వినతి చేశామని, స్పందించిన ఎమ్మెల్యే బోర్లు వేసేందుకు తగు చర్యలు తీసుకుంటామని భరోసా కల్పించారని తెలిపారు.

హుగ్గెల్లిలో ఉచిత కంటి వైద్య శిబిరం

జహీరాబాద్, ఏప్రిల్ 15, ప్రభాతవార్త: మడల పరిధిలోని హుగ్గెల్లి గ్రామంలో బుధవారం మెగూర్ ఆసపత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని గ్రామ సర్పంచ్ పట్లోళ్ల విమలశ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ విమల శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నర్సింహారెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్‌రెడ్డి, వార్డు సభ్యులు నరేష్, రాసమ్మ, నాయకులు నర్సింహులు, పాండురంగారెడ్డి, రాములు, సిద్దారెడ్డి, పాండుముదిరాజ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రైతులు మొబైల్ నంబర్లు అప్‌డేట్ చేసుకోవాలి: ఏవో

కొల్చారం, ఏప్రిల్ 15(ప్రభాతవార్త): మండలంలోని రైతులు యూరియా బుకింగ్ సక్రమంగా జరిగేలా మొబైల్ నంబర్లను వెంటనే అప్డేట్ చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి శ్వేతకుమారి సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ఎరువుల సరఫరాలో పారదర్శకతను పెంచేందుకు రైతు మొబైల్ నంబర్ ఆధారంగా యూరియా బుకింగ్ యాప్‌ను అమలు చేస్తోందని ఆమె తెలిపారు. ఇటీవల అనేక మంది రైతులు మొబైల్ నంబర్లు మార్చుకున్న కారణంగా యాప్‌లో నమోదైన పాత నంబర్ల వల్ల యూరియా బుకింగ్‌లో ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆమె పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో రైతులు ప్రస్తుత మొబైల్ నంబర్లను వెంటనే అప్డేట్ చేయించుకోవాలని సూచించారు. అప్డేట్ చేయించుకోవాలనుకునే రైతులు సమీపంలోని రైతువేదిక లేదా వ్యవసాయ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు. సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈఓ) వద్ద వివరాలు నమోదు చేసి ఫార్మర్ రిజిస్ట్రేషన్, యూరియా బుకింగ్ యాప్‌లో కొత్త మొబైల్ నంబర్ అప్డేట్ చేయించుకోవాలని చెప్పారు. సరైన మొబైల్ నంబర్ నమోదు చేసినప్పుడే యూరియా బుకింగ్ సక్రమంగా జరుగుతుందని, భవిష్యత్తులో ఎరువుల సరఫరా మరియు ఇతర వ్యవసాయ సమాచారాన్ని పొందేందుకు మొబైల్ నంబర్ కీలకమని ఆమె అన్నారు. కాబట్టి కొల్చారం మండలంలోని అన్ని గ్రామాల రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకొని తమ మొబైల్ నంబర్లను ఈ నెల 20వ తేదీ లోపు తప్పనిసరిగా అప్డేట్ చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి శ్వేత కుమారి కోరారు.

అంబేద్కర్ యువజన చైతన్య సంఘం నూతన కార్యవర్గం

శాలువాతో కార్యవర్గాన్ని సన్మానిస్తున్న దృశ్యం

కొల్చారం, ఏప్రిల్ 15 ప్రభాతవార్త : మండల పరిధిలోని రంగంపేట గ్రామంలో అంబేద్కర్ యువజన చైతన్య సంఘం నూతన కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతనఅధ్యక్షునిగా చిటుకుల గిరి, ఉపాధ్యక్షుడిగా తలారి మహేష్, ప్రధాన కార్యదర్శిగా తలారి వంశీకృష్ణ, కార్యదర్శిగా గామని పురుషోత్తం, కోశాధికారిగా తలారి రత్నయ్యను ఎన్నుకున్నారు. అలాగే సలహాదారులుగా చిట్కుల గంగారాం, బ్యాగరి సుధాకర్, మాదిగ ఎలేశంను సభ్యులు ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గాన్ని సంఘం సభ్యులు శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు చిటుకుల గిరి మాట్లాడుతూ తనపై విశ్వాసం ఉంచి అధ్యక్షునిగా ఎన్నుకున్న సంఘ సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. సంఘ అభివృద్ధి, యువతలో చైతన్యం పెంపొందించేందుకు కృషి చేస్తానని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన చైతన్య సంఘ సభ్యులు, గ్రామ యువకులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధిపై సమీక్షా సమావేశం

మాట్లాడుతున్న సర్పంచ్

కొల్చారం, ఏప్రిల్ 15 (ప్రభాతవార్త) : మండల పరిధిలోని తుక్కాపూర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ దొడ్ల ఆంజనేయులు అధ్యక్షతన గ్రామాభివృద్ధిపై సమీక్షా సమావేశం నిర్వహించారు. గ్రామంలో చేపడుతున్న అభివృద్ధి పనులు, ప్రజలకు అందిస్తున్న మౌలిక వసతులపై సమావేశంలో చర్చించారు. గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ, శానిటేషన్, వీధి లైట్లు, చెత్త ట్రాక్టర్ నిర్వహణను నిరంతరం పరిశీలిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని గ్రామ కార్యదర్శి సూచించారు. గ్రామంలో పారిశుధ్యాన్ని కాపాడుతూ ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఆరె రవీందర్, గ్రామ కార్యదర్శి, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతోనే ప్రమాదాల నివారణ

చిన్నశంకరంపేట, ఏప్రిల్ 15,ప్రభాతవార్త: రహదారుల భద్రత అందరి బాధ్యత అని చందాపూర్ సర్పంచి క్రిష్ణగౌడ్, ప్రధానోపాధ్యాయుడు పరమేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధి చందాపూర్‌లో విద్యార్థులు వాహనదారులను ఆపి హెల్మట్ ధరించాలని ప్లకార్డులను అవగాహన కల్పించారు. రోడ్డు ప్రమాదాల వల్ల అనేక కుటుంబాలు తీవ్రంగా నష్టపోతున్నాయని వారు వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించడంపై గ్రామస్థులు, ఉపాధ్యాయులు, వాహనదారులు అభినందించారు.